వామ్మో.. ఆ స్టేషనా..!



బీకేఎస్ స్టేషన్‌కు రావడానికి జంకుతున్న పోలీసులు

నిత్యం వివాదాలతో సిబ్బందికి తప్పని పనిష్మెంట్

కొన్నేళ్లుగా సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లపై వీఆర్‌లు, సస్పెన్షన్ వేటు



బుక్కరాయ సముద్రం పోలీసుస్టేషన్

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వివాదాల నేపథ్యంలో ఆ స్టేషన్‌కు రావాలంటే పోలీసులు జంకుతున్నారు. నిత్యం ఏదో ఒక వివాదంతో ఇక్కడ పని చేస్తున్న సీఐ, ఎస్ఐలుకు శిక్ష తప్పడం లేదు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం అప్‌గ్రేడ్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారంటే పోస్టు ఊస్టింగే అనే ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఇక్కడ కొన్నాళ్లుగా సీఐ, ఎస్ఐ సహా కానిస్టేబుళ్లపై బదిలీ, సస్పెన్షన్ వేటు సర్వసాధారణం అయ్యాయి. సమన్వయ లోపం, అధికారులు, కొంత మంది సిబ్బంది చేతివాటంతో పాటు కొందరు అధికారుల ప్రవర్తనా తీరుతో పోలీసుస్టేషన్ పరువు దిగజారి పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతం లో ఇక్కడి పని చేసిన కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి స్టేషన్‌కు వెళ్లిన బాధితులు, సామాన్యులకు అన్యాయం చేశార న్న ఆరోపణలతో సీఐలపై వేటు పడింది. కొంత మంది సిబ్బంది శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణ కంటే సంపాదనకు, రాజకీయ నాయకులకు ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో సస్పెండ్ అయ్యారు. ఇక లంచం తీసుకుంటూ సీఐ రాము ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఇలాంటివి ఈ స్టేషన్‌లో తరచూ జరుగుతుండటంతో ఇక్కడికి రావాలంటే జంకే పరిస్థితి నెలకొంది.

గతంలో... వేటు పడింది... వీరిపైనే..


2009లో ఈ స్టేషన్‌లో పనిచేస్తున్న అప్పటి ఎస్ఐ మోహన్‌కృష్ణపై అవినీతి ఆరోపణలు, వేధింపులు తదితర కారణాలతో సస్పెన్షన్ వేటు పడింది. అనంతరం 2014లో పనిచేస్తున్న ఎస్ఐ రాగిరిరామయ్య ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించారని సస్పెండ్ చేశారు. 2019లో సీఐగా వచ్చిన రెడ్డెప్పను వైసీపీకి అనుకూలంగా పని చేయలేదని రెండు నెలలుకే బదిలీ చేశారు. 2020లో వచ్చిన సీఐ రామారావు, ఎస్ఐ ప్రసాద్‌లను వైసీపీ నేతలు చెప్పినట్లు చేయలేదని ఏడాదిలోగా బదిలీ చేశారు. అనంతరం 2022లో డిసెంబరు 12న సీఐ రాము, కానిస్టేబుల్ కరీమ్‌లు ఓ వ్యక్తి నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. అనంతరం వచ్చిన సీఐ నాగార్జునరెడ్డి 2023లో ఓ దివ్యాంగుడిని కొట్టి తీవ్రంగా గాయపర్చిన ఘటనలో సస్పెండ్ అయ్యారు. అనంతరం సీఐగా వచ్చిన వెంకటేశ్వర్లు సమర్థవంతంగా పని చేస్తుండటంతో రాజకీయవేటు వేశారు. అనంతరం వచ్చిన సీఐ కరణాకర్ టీడీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు చేయడంతో పాటు అవినీతి ఆరోపణలు, స్టేషన్‌కు వచ్చిన బాధితులను అసభ్యపదజాలంతో దూషించడం వంటి కారణాలతో 2025 మార్చిలో వీఆర్‌కు పంపారు. వీటితో పాటు 2023, 2024లో ఇసుక అక్రమ రవాణా, స్టేషన్‌కు వచ్చిన బాధితులతో లంచం తీసుకుంటున్న ఆరోపణలతో కానిస్టేబుళ్లు బాషా, ముజిబుర్ రహిమాన్, నూర్‌బాషా, నిరంజన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జాన్సన్, లక్ష్మన్న తదితర సిబ్బందిపై వేటు పడింది.

సమర్థవంతమైన అధికారి వచ్చేనా...!



గత కొన్నేళ్లుగా నిత్యం ఏదో వివాదంతో సిబ్బందిపై వేటు పడుతోంది. బుక్కరాయసముద్రం మండలంలో 70వేలకు పైగా జనాభా ఉంది. జాతీయ రహదారి ఈ మండలంలో ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలు ఉండటంతో శాంతి భద్రతలు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. 2024 లో 309 కేసులు నమోదు అయ్యాయి. ఈ ఏడాది మూడు నెలలు గడవకముందే 70 కేసులు నమోదు అయ్యాయి అంటే క్రైమ్ రేటు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం పని చేస్తున్న సీఐను కూడా 20 రోజుల కిందట వీఆర్‌కు పంపారు. అప్పటి నుంచి ఆ సీటు ఖాళీగా ఉంది. కాగా ఈ స్టేషన్‌లో ఏ అధికారి కూడా పట్టుమని రెండేళ్ల పని చేయలేని పరిస్థితి నెలకొంది.

ఓవర్ లోడ్..!



తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

అనంతపురం రూరల్ మండలంలోని నరసనాయునికుంట గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీవాసులు విద్యుత్ ఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ కరెంటు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నట్లు వాపోతున్నారు. కాలనీ ఏర్పాటైనపుడు 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అప్పట్లో 50 గృహాలు ఉండటంతో సమస్య తలెత్తేది కాదు. ప్రస్తుతం కాలనీలో వంద గృహాలున్నాయి. దీనికితోడు గ్రామంలోని ఓసీ కాలనీలో గల 20 కుటుంబాలకు ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచే విద్యుత్తు సరఫరా అవుతోంది. దీంతో పదేళ్లుగా ఓవర్‌లోడ్ సమస్యలు తలెత్తున్నట్లు గ్రామస్థులు అంటున్నారు. సంబంధిత అధికారులకు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోయిందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.

అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో 3వేలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి 30 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. గృహ కనెక్షన్లకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ మరో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఆయావర్గాల ద్వారా తెలుస్తోంది. ఆ మేరకు గ్రామస్థులు.. సంబంధిత అధికారులను కోరినట్లు తెలుస్తోంది. సదరు అధికారులు పెడచెవిన పెట్టడంతో నిత్యం సమస్యలు తలెత్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇలా ఓల్టేజీ సమస్యలు అనంతపురం నగరంతోపాటు జిల్లా అంతటా ఉన్నాయి.

అనంతపురం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య తీవ్రమవుతోంది. ఈ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వేసవి కావడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. తరచూ తలెత్తుతున్న కరెంటు సమస్యలతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఓవర్ లోడ్‌ను అధిగమించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలున్నాయని తెలిసినా వాటిని పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారు. ఫలితంగా ప్రజలు కరెంటు సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

7.07 లక్షల గృహ కనెక్షన్లు

జిల్లావ్యాప్తంగా 10.19 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో గృహ కనుక్షన్లు 7.07 లక్షలున్నాయి. అనంతపురం డివిజన్ పరిధిలో 2.80 లక్షలు, గుత్తి 2.31లక్షలు, కళ్యాణదుర్గం 1.95లక్షలు ఉన్నట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటికి సింగిల్ ఫేజ్ కింద 10వేలు, త్రీఫేజ్ కింద 15వేల ట్రాన్స్‌పార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. 5 కేవీ మొదలుకుని, 500 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌పార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా ఉంటోంది. ఒక్కో ట్రాన్స్‌పార్మర్ సామర్థ్యానికి మించి గృహాల కనెక్షన్లు ఉండటంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.



నరసనాయనికుంట ఎస్సీ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్

ఇంట్లో ఉండలేం..



కరెంటు సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. అసలే ఎండాకాలం. ఎండలు మండిపోతున్నాయి. దీనికితోడు కరెంటు సక్రమంగా ఉండటం లేదు. ఇంట్లో ఉంటే ఒకటే ఉక్కపోత. పండగ పూటైతే అధ్వానంగా ఉంటుంది. కొంతసేపు కూడా ఇంట్లో ఉండలేం. అంత అధ్వానంగా కరెంటు ఉంటుంది.

- ఓబులమ్మ, ఎస్సీ కాలనీ, నరసనాయనికుంట

సమస్యలు పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

అవస్థలు పడుతున్న ప్రజలు..

వేసవి కావడంతో పెరిగిన ఇబ్బందులు

సమస్యలు...

ట్రాన్స్‌పార్మర్ ఓవర్‌లోడ్ కారణంగా అధిక వేడి, వైండింగ్ దెబ్బతినడం ఇన్సులేషన్ విఫలం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈక్రమంలోనే ట్రాన్స్‌పార్మర్లు కాలిపోతున్నాయి. విద్యుత్ లైన్లు దెబ్బతింటున్నాయి. షార్ట్‌సర్క్యూట్ అవుతున్నాయి. ఈ ప్రభావం ప్రజలపై పడుతోంది. ఓవర్ లోడ్ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వేసవి కావడంతో సమస్య మరింత ఎక్కువవుతోందన్న అభిప్రాయాలు ఆయా వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. సమస్య వచ్చిన సందర్భాల్లో లైన్‌మెన్ తాత్కాలిక చర్యలు చేపట్టి మిన్నకుండిపోతున్నారు. ఈక్రమంలో సమస్య తిరగబెడుతోంది. కనెక్షన్లకు అనుగుణంగా ట్రాన్స్‌పార్మర్లు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా సమస్యను అధిగమించే వీలుంటుందన్న వాదనలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి.



రోజూ ఇబ్బందులే..

గ్రామంలోని ఓసీ కాలనీలోని కొన్ని ఇళ్లకు ఎస్సీ కాలనీలోని ట్రాన్స్‌పార్మర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ట్రాన్స్‌పార్మర్‌కు ఎక్కువ కనెక్షన్లు ఉండటంతో రోజూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌పార్మర్ వద్ద ఫీజులు కాలిపోతున్నాయి. లైన్‌మెన్‌కు చెప్పి ప్రయోజనం లేకుండాపోయింది. ఉన్నతాధికారులు స్పందించి అదనపు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయడమో, అధిక కెపాసిటీ ఉన్న మరొకటి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- శ్రీనివాసులునాయుడు, నరసనాయనికుంట గ్రామం

ఓవర్‌లోడ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లాలో ఓవర్ లోడ్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సమస్య ఉన్న చోట్ల అదనపు ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా కేంద్రంలో గత నెలలో అదనపు ట్రాన్స్‌పార్మర్లు చాలా ఏర్పాటు చేశాం. మా దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

- శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ



పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు 50 వేలు పరిహారం ఇవ్వాలి..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ
- దెబ్బతిన్న పంటల పరిశీలన

6



దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

పోలీసుల అదుపులో కియ దొంగలు

(మెయిన్‌లో)

కానిస్టేబుళ్లే బలి..!

అవినీతి మరకలున్న ఎస్ఐలు, సీఐలపై చర్యలు శూన్యం

- పది నెలల వ్యవధిలో ఇది రెండోసారి..
- వీఆర్‌కు ఆదేశాలిచ్చిన వారిపైనా సిఫార్సులు
- స్పెషల్ బ్రాంచ్ నివేదికల్లో ఏముంది..?

(వివరాలు 7లో...)

మూడు నెలల్లో 8 జాబ్‌మేళాలు

విస్తృత అవగాహన కల్పించాలి

జిల్లా నైపుణ్య కమిటీ సమావేశంలో కలెక్టర్



మొదటి క్వార్టర్ జాబ్‌మేళా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

అనంతపురం టౌన్/రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాబ్ మేళాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం 4వ జిల్లా నైపుణ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 8 జాబ్ మేళాలు నిర్వహించాల్సి ఉందన్నారు. సోషల్, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్, స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీఏ, ఇతర అన్ని శాఖల అధికారులు జాబ్ మేళాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లకు పరిశ్రమలను అనుసంధానం చేయాల న్నారు. పీఎం విశ్వకర్మ యోజన కింద జిల్లాలో 205బ్యాచ్‌లలో 6,004మందికి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇంకా 111మందికి శిక్షణ కొనసాగుతోందన్నారు. అనంతరం 2025-26 సంవత్సరంలో మొదటి క్వార్టర్ జాబ్ మేళా క్యాలెండర్‌కి సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు.

జాబ్‌మేళాలు ఇలా...

అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి ఏప్రిల్ 25న, రాప్తాడుకు మే2న, కళ్యాణదుర్గానికి మే16న, రాయదుర్గానికి మే 23న, గుంతకల్లుకు మే 30న తాడిపత్రికి జూన్ 6న, శింగనమలకి జూన్ 13న, ఉరవకొండ నియోజకవర్గానికి జూన్ 27న జాబ్ మేళాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, జేఎన్‌టీయూ ప్లేస్‌మెంట్ సీఈఏ శ్రీనివాసులు, ఎస్కేయూ అధికారి కృష్ణ, మెప్మా పీడీ విశ్వజ్యోతి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధి కల్పనా అధికారి కళ్యాణి, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ రమాదేవి, ప్రభుత్వ ఐటీఐ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించి వందశాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఉల్లాస్ కార్యక్రమం అమలుపై మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజలు, కార్మికులు అక్షరాస్యత సాధించడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025-26లో జిల్లాలో 35,286మందిని అక్షరాస్యులుగా తీసుకురావాలని లక్ష్యం పెట్టుకున్నామని,ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు సూచిం చారు. మే5 నుంచి సెప్టెంబరు వరకు అక్షరాస్యతను పెంచే కార్యక్రమా లు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వయోజన విద్య డీడీ ఆంజనేయులు, డీపీఓ నాగరాజనాయుడు, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ అక్రమాలపై కఠిన చర్యలు : కలెక్టర్

పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో పింఛన్ల పంపిణీ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారులతో ఐవీఆర్ఎస్ సర్వే చేస్తున్న నేపథ్యంలో పింఛన్ పంపిణీ సమయంలో చాలా మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు వెళితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, డీపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

సహకార శాఖలో ఆకాశరామన్న అరాచకాలు..!

- లేఖలతో ఉద్యోగినులకు వేధింపులు
- కొన్నేళ్లుగా ఇదే తంతు
- కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదుతో బహిర్గతం
- సీఎం, మంత్రి పేర్లతో నకిలీ సిఫార్సులు
- విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆకాశరామన్న పేరుతో ఉత్తరాలు రాయడం...ఉద్యోగినులను మానసికంగా వేధింపులకు గురిచేసి పైశాచికానందం పొందడం ఆయన ప్రధాన విధి. ఉద్యోగినులకు అసభ్యకర పదజాలంతో లేఖలు రాసి ఇబ్బందులకు గురిచేయడం సహకారశాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సతీష్‌కుమార్ అలవాటుగా మార్చుకున్నాడు. గత పదేళ్లుగా ఈ తంతు నడుస్తోంది. విషయాన్ని బయటకు చెప్పడానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి ఉద్యోగులు సాహసించలేకపోయారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంతకాలను ఫోర్జరీ చేస్తూ...వారి పేర్లతో సిఫారసు లేఖలు పంపాడు. దీంతో కమిషనరేట్‌లో అనుమానం వచ్చి విచారించగా సతీష్‌కుమార్ అడ్డంగా దొరికిపోయాడు. తనపై ఎవరూ చర్యలు తీసుకోకూడదని నకిలీ సిఫారసు లేఖలను తయారు చేయడంతోనే విషయం వెలుగులోకి వచ్చింది. సహకారశాఖలో పని చేస్తున్న ఉద్యోగినులు సతీష్‌కుమార్ వేధింపులు భరించలేక జనవరిలో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి సతీష్‌కుమార్ వ్యవహారశైలిపై నిఘా వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజనల్ లెవల్ కోఆపరేటివ్ ఆఫీసర్ (డీఎల్‌సీఓ) ప్రభాకర్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. విచారణ చేయాల్సిన అవసరం లేదంటూ ఆయన కాలయాపన చేస్తూవచ్చారు. సతీష్‌కుమార్‌ను కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. చివరికి ఉద్యోగినుల ఫిర్యాదు చేయడం, సీఎం, మంత్రి సంతకాల ఫోర్జరీతో సతీష్‌కుమార్ అడ్డంగా దొరికిపోయాడు. సతీష్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు డీసీఓ సిఫారసు చేశారు.

ఉద్యోగినుల ఫిర్యాదుతో బహిర్గతం

అసభ్యకర పదజాలంతో ఆకాశరామన్న పేరుతో ఉత్తరాలు రాస్తూ తమను మానసిక వేధింపులకు గురిచేస్తున్న సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్‌పై జనవరిలో కలెక్టర్, ఎస్పీలకు ఉద్యోగినులు ఫిర్యాదు చేశారు. దీంతో విషయం బయటకు పొక్కింది. పరువు, భయంతో ఉద్యోగినులు సుమారు పదేళ్లపాటు సతీష్ కుమార్ వేధింపులను భరిస్తూ వచ్చారు. జనవరిలో తీవ్రపదజాలంతో రాసిన లేఖలను చూసిన ఉద్యోగినులు మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలోకి చేరిన సతీష్‌కుమార్.. జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా, సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందాడు. సహకారశాఖలో ఓ కీలక అధికారి సతీష్ కుమార్‌ను పూర్తిస్థాయిలో కాపాడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి.



సతీష్ కుమార్

వృత్తిలో ప్రవృత్తి

తాను చేస్తున్న ఉద్యోగాన్ని నిర్లక్ష్యం చేస్తూ...షేర్‌మార్కెట్ బిజినెస్ పేరుతో సతీష్‌కుమార్ ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నాడు. 2017 నుంచి ఇలాంటి వ్యవహారాలు అధికమైనట్లు తెలుస్తోంది. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని అందరినీ వేధించేవాడు. ఎవరైనా నిరాకరిస్తే పిటీషన్ల పేరుతో మానసికంగా హింసించడం ప్రారంభిస్తాడు. పిటీషన్లతో గత పదేళ్లుగా సహకార శాఖను భ్రష్టుపట్టిస్తున్నాడని... తోటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం అనంతపురం రామ్‌నగర్‌లో ఉన్న డీఎల్‌సీఓ కార్యాలయం నుంచి గుత్తికి బదిలీపై వెళ్లాడు.

లేఖలతో వేధింపులు

సతీష్‌కుమార్ గుత్తి సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. గత కొన్నేళ్లుగా ఆ శాఖలో ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నాడు. తన మాట వినకపోయినా... తన పనికాక పోయినా లేఖలతో ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తూ పైశాచికానందం పొందుతున్నాడని తోటి ఉద్యోగులు వాపోతున్నారు. అధికారపార్టీలోని కొందరు నాయకుల అండదండలతోనే సతీష్‌కుమార్ బరితెగిస్తున్నాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలోనూ ప్రజాప్రతిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతోనే అధికారులు సతీష్ కుమార్‌పై చర్యలు తీసుకోవడానికి వెనుకడుగువేసినట్లు సమాచారం.



డీసీఓ కార్యాలయం

విచారణ చేస్తున్నాం



సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సతీష్‌కుమార్ వ్యవహార శైలిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిన మాట నిజమే. రాష్ట్ర శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నాం. పలువురు ఉద్యోగినులు రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే డీఎల్‌సీఓను విచారణకు ఆదేశించాం. విచారణ నివేదిక రాగానే ఉన్నతాధికారులకు పంపుతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి. ఇప్పటికే అనంతపురం నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. **- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)**



పుట్లూరులో దెబ్బతిన్న అరటి పంట



గార్లదిన్నె మండలం ఇల్లూరులో దెబ్బతిన్న వరి పంట

గాలివాన విధ్వంసం

● రూ.2.28 కోట్ల పంటనష్టం ● 266.6 హెక్టార్లల్లో దెబ్బతిన్న పంటలు



జంబులదిన్నెలో పడిపోయిన మామిడిచెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు



అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురు గాలులు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఉద్యాన, వ్యవసాయ శాఖ పరిధిలో రూ.కోట్ల విలువైన పంట నష్టం జరుగుతోంది. దీంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విన్నవిస్తున్నారు. జిల్లాలో సోమవారం రాత్రి ఈదురు గాలులు, వర్ష బీభత్సానికి 266.6 హెక్టార్లల్లో రూ.2.88 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, అనంతపురం, యల్లనూరు, ఉరవకొండ, కూడేరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, రాయదుర్గం, గుమ్మఘట్ట, గుంతకల్లు, పెద్దవడుగూరు మండలాల్లో 115 మంది రైతులకు సంబంధించి 94.60 హెక్టార్లల్లో రూ.1.48 కోట్ల విలువైన అరటి, మామిడి, బొప్పాయి, కర్బూజ, మునగ, కాకర పంటలు దెబ్బతిన్నాయి. నార్పల, గార్లదిన్నె, కంబదూరు, శింగనమల మండలాల్లో 93 మంది రైతులకు సంబంధించి 172 హెక్టార్లల్లో రూ.1.40 కోట్ల విలువైన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా కణేకల్లులో 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుట్లూరు 9.4, నార్పల 9.2, బెళుగుప్ప 7.8, గుత్తి 7.2, కంబదూరు 2.6, ఉరవకొండ 2.2, అనంతపురం 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● పుట్లూరు మండలంలో ఈదురు గాలులకు 80 ఎకరాల్లో అరటి పంట నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారి శైలజ తెలిపారు. కడవకల్లు, దోసలేడు, చెర్లోపల్లి, మడ్డిపల్లి గ్రామాల్లో 40 మంది రైతులు నష్టపోయారని, ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని ఆమె తెలిపారు.

● నార్పల మండలం బండ్లపల్లి, గంగనపల్లి, బి.పప్పూరు గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంటను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన అధికారి శైలజ పరిశీలించారు. నార్పల, హెచ్ శోధనపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న మామిడి తోటలను ఉద్యాన విస్తరణాధికారి హరిచరణ్ రెడ్డి, రైతు సేవా సిబ్బంది దివ్య, శశిధర్, పరిశీలించారు. నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు.

● గార్లదిన్నె మండలం కొప్పలకొండ, ఇల్లూరు, జంబులదిన్నె, కేశవాపురం, కమలాపురం, సిరివరం తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పది మంది రైతులకు చెందిన 15 ఎకరాల వరి పంట, ఆరుగురు రైతులకు చెందిన 10 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. నష్ట పరిహారం అందచేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి సోమశేఖర్ రైతులకు భరోసా ఇచ్చారు. ఇల్లూరు, జంబులదిన్నె తదితర గ్రామాల్లో కూలిన మామిడి చెట్లను అధికారులు పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం వస్తుందని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

కూడేరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో ఉద్యాన పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని కడదరకుంట, చోళసముద్రం గ్రామాల్లో దెబ్బతిన పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. కడదరకుంట గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ నాలుగెకరాల్లో సాగు చేసిన అరటి పంట ఈదురుగాలలు, వర్షానికి పూర్తిగా పడిపోయింది. రూ.8 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతిందంటూ రైతు కన్నీరు మున్నీరయ్యాడు. దిగుబడి ఆశాజనకంగా రావడంతో అప్పుల నుంచి బయట పడుతాననుకున్న సమయంలో అకాల వర్షం, ఈదురుగాలులు దెబ్బతీశాయని వాపోయాడు. అనంతరం చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు వెంకటనారాయణ అరటి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ.. అనంతపురం, కడప జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణం ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, కేశవరెడ్డి, గోపాల్, రమణ, రాజేష్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ కుళ్లాయిస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెరుగు సంగప్ప, మల్లికార్జున, రమణ, మలరాయుడు పాల్గొన్నారు.

● కూతురు..!

అమ్మా..
త్వరగా తొయ్..
బడికి సమయమౌతోంది..!
బతుకు బాధ్యత నీదే
అయినా..
కాస్తంత బరువు
పంచుకోవడం..
నా బాధ్యత కూడానూ..!



(గుంతకల్లు పట్టణానికి చెందిన ఈ చిన్నారి పేరు ఐశ్వర్య. ఎస్‌జేపీ పాఠశాల విద్యార్థిని. తల్లి సుకన్య తోపుడు బండిపై పండ్లను అమ్ముతుంటారు. తండ్రి రవి కుమార్ దినకూలీ. శ్రమ జీవుల కుటుంబంలో పుట్టిన ఈ కూతురుకు చదువంటే ఆసక్తి. రోజూ ఉదయం ఇలా తల్లికి సాయంగా బండిని తోసుకుంటూ పండ్లు అమ్మే ప్రాంతానికి చేరుస్తుంది. ఆ తరువాత బడికి వెళ్లిపోతుంది. మంగళవారం ఉదయం కూడా ఇలా తల్లికి సాయం పడుతూ.. 'త్వరగా తొయ్ అమ్మా.. బడికి టైం అవుతోంది..' అంటూ ఆత్రపెడుతూ కనిపించింది)

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు టౌన్

24 నుంచి డిగ్రీ పరీక్షలు

జ్ఞానభూమి, ఎస్కేయూ వెబ్‌సైట్లలో హాల్ టిక్కెట్లు

ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో ఈనెల 24నుంచి డిగ్రీ రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు, మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ మంగళవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24నుంచి మే 6వరకు. ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ ఈ నెల 25నుంచి మే 31 వరకు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 55 కేంద్రాల్లో 25వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నా రు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను జ్ఞానభూమి పోర్టల్‌లో డౌన్ చేసుకోవచ్చని సూచించారు. మెగా సప్లిమెంటరీ విద్యార్థులు ఎస్కేయూ వెబ్‌సైట్‌లో డౌన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తృతీయ సంవత్సరం ఐదు, ఆరు సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 24నుంచి మే 16వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలుంటాయని వివరించారు.

జిల్లావాసులకు కందుకూరి పురస్కారాలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 13 మందికి జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు లభించాయి. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా పురస్కారాలు ప్రకటిం చారు. ముగ్గురిని రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలకు, 107 మందిని జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారా లకు ఎంపిక చేశారు. రంగస్థల ప్రముఖులు బుర్రా సాయిమాధవ్, గుమ్మడి గోపాలకృష్ణ, పాటిబండ్ల ఆనందరావు, చిక్కాల బాలాజి, కేకేఎల్ స్వామి, బాలాజినాయక్, దాసరి చలపతిరావు, గాజుల పద్మజ, బుద్దాల వెంకటరామారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పురస్కార గ్రహీతల ను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా తరపున 13 మందిని కందుకూరి విశిష్ట పురస్కారాలకు ఎంపిక చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సభలో వీరికి పురస్కారాలతోపాటు నగదు బహుమతులు అందజేసి సత్కరించనున్నారు.

పురస్కార గ్రహీతలు వీరే...

వాల్మీకి కుళ్లాయప్ప, సోమర లక్ష్మీనారాయణ, సంగాల నారాయణస్వామి, పి.ఆనంద్, జేకే రామాంజనేయులు, వి.ఆదినారాయణరెడ్డి, జీజే ఎర్రిస్వామి, ఎ.రామగోపాల్, జి.నరహరి, ఎస్ నారాయణస్వామి, శివశంకర్, డి.రాజకుళ్లాయప్ప, బి.వరప్రసాద్.

సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు



గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకుంటున్న జాస్మిన్ వేదశ్రీ

గుత్తి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దొడ్డి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీ టీచర్ ఎంబీ జాస్మిన్ వేదశ్రీ క్రిస్టియన్ సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు సాధించారు. గతేడాది డిసెంబరు 1న ఆవెంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన 1046 మంది కళాకారులు ఆన్‌లైన్‌లో క్రిస్టియన్ పాటలు పాడారు. తద్వారా గిన్నిస్ రికార్డ్సులో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 14వ తేదీన ఏర్పాటు చేసిన అభినందన సభలో బహుమతులతోపాటు సర్టిఫికెట్, మెడల్‌ను ప్రదానం చేసినట్లు టీచర్ తెలిపారు.

భళా.. మహిమాన్విత్..

రెండో తరగతి విద్యార్థికి గిన్నిస్ వరల్డ్ రికార్డు



గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న మహిమాన్విత్

చిలమత్తూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రెండో తరగతి విద్యార్థి మహిమాన్విత్ పియానో వాయిద్యానికి గిన్నిస్ రికార్డు దాసోహమైంది. పియానో వాయిద్యాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. ఆ వీడియోను చూసిన వారు ముగ్ధులయ్యారు. పోస్ట్ చేసిన గంటలోనే ఏకంగా 1,046 మంది వీక్షించి, అభినందించారు. దీంతో అతి తక్కువ సమయంలో ఎక్కువమంది వీక్షకులు చూసిన వీడియోగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు గుర్తించారు. దీంతో చిన్నారి మహిమాన్విత్‌కు అవార్డ్సులో చోటు కల్పించారు. టేకులోడు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ముత్యాలప్ప కుమారుడు మహిమాన్విత్.

స్థానిక ఎస్ఎస్‌వైవీఎన్ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మహిమాన్విత్‌ను పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఏంటో ఈ పంచాయతీ?

పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ల దిగులు



క్లరికల్ సిబ్బంది అసమర్థతతో అర్హులకు అన్యాయం

ముందుకు కదలని గ్రేడ్-3, గ్రేడ్-4ల ప్రక్రియ

గ్రేడ్-5కు మాత్రమే అప్పుడే శ్రీకారం

ఏ ప్రాతిపదికన ఉద్యోగోన్నతి ఇస్తారోననే ఉత్కంఠ



(డీపీఓ కార్యాలయం(ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులను ప్రమోషన్ల దిగులు వేధిస్తోంది. జిల్లా పంచాయతీ కార్యాలయంలో క్లరికల్ సిబ్బంది అసమర్థతతో ప్రమోషన్లలో అర్హులకు అన్యాయం జరుగుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఇప్పటి వరకు కొందరు గ్రేడ్-1 కార్యదర్శులకు మాత్రమే ఈఓఆర్డీలుగా ప్రమోషన్ కల్పించారు. గ్రేడ్-2 కార్యదర్శులలో కొందరికి గ్రేడ్-1 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పై రెండు కూడా కమిషనర్ కార్యాలయం పరిధిలో ఉండటంతో అక్కడికి నివేదిక పంపి, అక్కడ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు అవకాశం కల్పించారు. ఇక మిగిలిన గ్రేడ్లకు కలెక్టర్ ద్వారా అనుమతి పొంది తుది జాబితాను రూపొందించి కమిషనర్ కార్యాలయానికి పంపి ప్రమోషన్లు ఇవ్వాలి. అయితే అసలైన సమస్యలు ఇక్కడే మొదలయ్యాయి. సీనియార్టి జాబితా, రోస్టర్ తయారు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆఖరికి ఏదోలా ఫైల్ తయారు చేసి కమిషనర్ కార్యాలయానికి పంపారు. అక్కడ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పుకొస్తున్నారు. గ్రేడ్-3, గ్రేడ్-4 ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి కాకనే గ్రేడ్-5 కార్యదర్శుల ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. అయితే మిగిలిన జిల్లాల్లో ఇప్పటికే ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఎక్కడా పెండింగ్ లేకుండా తగిన చర్యలు చేపట్టి గ్రేడ్-5 కూడా పూర్తి చేశారు. దీంతో మీరేందుకు చేయలేకపోతున్నారని కమిషనర్ కార్యాలయం నుంచి డీపీఓను ప్రశ్నించినట్లు సమాచారం.

గతంలో దూకుడు.. ప్రస్తుతం బ్రేక్

డీపీఓ నాగరాజనాయుడు గతంలో పనిచేసిన ప్రాంతాల్లో చాలా చురుగ్గా ఎప్పటి సమస్యలు అప్పుడు పరిష్కరించారన్న గుర్తింపు పొందారు. అదే తరహాలో ఇక్కడ కూడ చేస్తారని సిబ్బంది ఆశించి, భంగపడ్డారు. నాగరాజనాయుడు కర్నూలు డీపీఓగా పని చేసిన రోజుల్లో అప్పటి ప్రభుత్వ అండదండలు మెండుగా ఉండేవన్న ప్రచారం జరుగుతోంది. దీంతో తమ ఆలోచనలకు పదును పెట్టి పాలనాపరమైన అంశాల్లో చురుగ్గా వ్యవహరించారన్న గుర్తింపు ఉంది. అలా చురుగ్గా వ్యవహరించిన వాటిలో కొన్నింటికి ప్రస్తుతం సంజాయిషీ చెప్పుకోవాల్సి రావడం ఆయన స్పీడ్‌కు బ్రేక్‌లు పడినట్లైంది. వైసీపీ ప్రభుత్వంలో అండదండలందించిన ఓ మంత్రి ప్రస్తుతం అధికార పార్టీలో కూడా ప్రజాప్రతినిధిగా ఉన్నారు. దీంతో మనకేమి ఇబ్బంది ఉండదని డీపీఓ భావించారు. అయితే అప్పటి మంత్రి పాచికలు ప్రస్తుత ప్రభుత్వంలో పారకపోవడంతో ఆయన అనుయాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. కర్నూలు డీపీఓగా ఉన్న సమయంలో జరిగిన తప్పిదాలకు సంబంధించి నెలలో రెండు రోజులు సంజాయిషీ ఇచ్చుకోవడానికి వెళ్లాల్సి రావడం, ఇక్కడి ప్రజా ప్రతినిధుల సహకారం లేకపోవడంతో డీపీఓ నాగరాజనాయుడు ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు సమాచారం.

డీపీఓకు బదిలీ భయం



ఉద్యోగోన్నతుల ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధుల మాట చెల్లుబాటు కాకపోతే డీపీఓపై భారీగా వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది. ఒక వేళ వారి సిఫార్సులు మన్నిస్తే కోర్టు కేసులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఇప్పటికే డీపీఓను మార్చాలని పెద్ద ఎత్తున ఒత్తిళ్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బదిలీకి బలమైన కారణం లేకపోవడంతో ఆయన సేఫ్‌గా ఉన్నారు. బదిలీల ప్రక్రియలో చిన్న లోపం దొర్లినా దాన్ని సాకుగా చూపి సాగనంపే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. దీంతో డీపీఓ జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.

గ్రేడ్లు.. ఉద్యోగులు.. ఖాళీలు ఇలా..

ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రేడ్-5 ప్రమోషన్లు చేపట్టేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు. అయితే గ్రేడ్-3, గ్రేడ్-4 కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించిన తరువాతే గ్రేడ్-5 కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించే అవకాశం ఉంది. అలా కాకుండా గ్రేడ్-5 కార్యదర్శుల ఉద్యోగోన్నతులకు శ్రీకారం చుడితే ఖాళీ అయ్యే స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియని పరిస్థితి. గ్రేడ్ల వారిగా ఖాళీలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 49 మంది గ్రేడ్-1 కార్యదర్శులు ఉండాల్సి ఉండగా 43 మంది ఉన్నారు. గ్రేడ్-2 కార్యదర్శుల్లో అర్హులకు ఉద్యోగోన్నతి కల్పిస్తే గ్రేడ్-2 ఖాళీలు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. గ్రేడ్-2 కార్యదర్శులు 18 మంది ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. ఇందుకు కొన్నేళ్లుగా గ్రేడ్-3 కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించకపోవడమే కారణమని తెలిసింది. గ్రేడ్-3 కార్యదర్శులు 115 మంది ఉండాల్సి ఉండగా అందరూ ఉన్నారు. దీంతో వీరు ఏళ్లుగా ఎటువంటి ప్రమోషన్లు లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉన్నారు. గ్రేడ్-4 కార్యదర్శులకు ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు లేవంటే పరిస్థితి ఎంత దారణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరు 441 మంది ఉండాల్సి ఉండగా 333 మంది మాత్రమే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన గ్రేడ్-5 కార్యదర్శులకు ప్రమోషన్ కల్పించి ఈ ఖాళీలు భర్తీ చేయడానికి శ్రీకారం చుట్టనున్నారు.

ర్యాంకులా .. ప్రొబేషన్ ఖరారా?

గ్రేడ్-5 కార్యదర్శులకు సంబంధించి ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుడుతుండటంతో ఇందులో పలు అపోహలు కలుగుతున్నాయి. ఉద్యోగం పొందినప్పటి ప్రతిభకు ఆధారంగా వచ్చిన ర్యాంకును పరిగణలోకి తీసుకుంటారా..? లేదా రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకొని ప్రొబేషన్ ఖరారు చేసుకున్నవారికి ప్రాధాన్యం ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది. ఇందులో అందరికి కాకపోయిన కొంత మంది దగ్గర సమస్యలు తలేత్తే అవకాశం ఉంది. ప్రతిభకు అనుగుణంగా ర్యాంకుల వారిగా ఉద్యోగాలు పొందినప్పటికీ ఉద్యోగంలో చేరడానికి ఆసక్తి లేక అనివార్య కారణాలతో ఆలస్యంగా ఉద్యోగంలో చేరిన వారు ఉన్నారు. ఉద్యోగంలో చేరి ఇక్కడ నచ్చక తిరిగి ఎలాంటి సమాచారం లేకుండా పోయి తిరిగి వచ్చిన వారు ఉన్నారు. ఇలాంటి వారికి ప్రొబేషన్ ఖరారులో ఆలస్యం అయింది. దీంతో ఏ ప్రతిపాదికన ఉద్యోగోన్నతులు కల్పిస్తారన్న చర్చ జరుగుతోంది.

జాతీయ హాకీ అకాడమీకి

సనప విద్యార్థిని



జాతీయ హాకీ అకాడమీకి ఎంపికైన లక్ష్మి

ఆత్మకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సనప గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మి జాతీయస్థాయి హాకీ అకాడమీకి ఎంపికైంది. తమ పాఠశాల పూర్వ విద్యార్థిని ఈ ఘనత సాధించడం పట్ల సనప ఉన్నత పాఠశాల పీడీ నాగరాజు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని లక్ష్మి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిందన్నారు. ప్రస్తుతం కర్ణాటకలోని వడికెర స్పోర్ట్స్ అథారిటీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. విద్యార్థిని తల్లి శివమ్మ ఆశావర్కర్, తండ్రి పోతులయ్య కూలి పనులకు వెళ్తుంటారన్నారు. తమ కూతురు జాతీయ అకాడమీకి ఎంపికవడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. అకాడమీలో శిక్షణ పొందిన వారు జాతీయ జట్టులో స్థానం సంపాదిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినిని టీచర్లు, గ్రామస్థులు అభినందించారు.

కార్మిక సమస్యలపై ప్రభుత్వం

నిర్లక్ష్యం

వేతన, పీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప విమర్శించారు. పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పంపుహౌస్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్మికుల సమ్మె మంగళవారం పదో రోజుకు చేరుకుంది. సమ్మెకు నల్లప్ప మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అనేక గ్రామాలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామిరెడ్డి పథకానికి నిధులు మంజూరు చేయకపోవడం, కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలివ్వకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు వేతనాలు, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన సీపీఎం ఆందోళనలు చేపడుతుందన్నారు. సమ్మెకు ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి కార్మిక నాయకులు వన్నూరుస్వామి, అల్లాబకాష్, గంగాధర, నరేష్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు దళారీ మోసం

పంట కొంటానని హామీ... బాపట్లకు వెళ్లాక చేతులెత్తేసిన వైనం

ధర్నాకు దిగిన అన్నదాతలు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దళారీ మాటలు నమ్మి వెళ్లిన రైతులు నాలుగు రోజులపాటు పడిగాపులు కాయాల్సివచ్చింది. మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన కొందరు రైతులు పొగాకు దిగుబడిని విక్రయించేందుకు బాపట్ల జిల్లా మేదరమట్ల గ్రామానికి చెందిన హరిబాబు అనే వ్యక్తికి ఫోన్ చేశారు. కొనుగోలు చేస్తానని అతడు చెప్పాడు. దీంతో పదిమంది రైతులు నాలుగు రోజుల క్రితం 50 వాహనాల్లో పొగాకు తరలించారు. రోజులు గడుస్తున్నా హరిబాబు కొనుగోలు చేయకపోవడంతో ఆందోళన చెందిన రైతులు ధర్నాకు దిగారు. జిల్లా యంత్రాంగం స్పందించి, పొగాకు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. బుధవారం కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పినట్లు రైతులు తెలిపారు. నాలుగు రోజులుగా లాడ్జీలో ఉండడానికి, భోజనం తదితరాలు వేల రూపాయలు ఖర్చయినట్లు రైతులు తెలిపారు.

పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది

- సుబ్బారెడ్డి, రైతు, పెద్దవడుగూరు



పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ముందస్తుగా కొనుగోలు ఒప్పందంతో పొగాకు పంట వేశా. బాపట్ల జిల్లా మేదరమట్ల గ్రామానికి చెందిన హరిబాబును కొనుగోలు చేయాలని ఫోన్‌లో సంప్రదించాం. అధిక మొత్తంలో తీసుకొస్తే కొనుగోలు చేస్తానని చెప్పడంతో ఐదు వాహనాల్లో తరలించాం. నాలుగు రోజులు కాలయాపన చేశారు. హోటళ్ల అద్దె వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. దళారీ మాట నమ్మి మోసపోయాం.

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



ద్వితీయ స్థానంలో నిలిచిన రగ్బీ మహిళల అనంతపురం ఉమ్మడి జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 10వ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ రగ్బీ సీనియర్ పురుషులు, మహిళల పోటీలు మంగళవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో నెల్లూరు ప్రథమస్థానం, కర్నూలు ద్వితీయ స్థానం, గుంటూరు తృతీయ స్థానం, అనంతపురం నాలుగో స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పుగోదావరి విజేతగా నిలవగా, ఉమ్మడి అనంతపురం జిల్లా రన్నరప్‌గా నిలిచింది. డీఆర్‌ఓ మలోలా, పీటీసీ అడిషినల్ ఎస్పీ మల్లికార్జున వర్మ, ఆర్డీఓ కేశవనాయుడుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జానీశంకర్, కార్యదర్శి సంపత్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆర్గనైజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, మెడికల్ డైరెక్టర్ కృష్ణ, సీనియర్ క్రీడాకారులు బయన్న, శంకర్, తిప్పేస్వామి, కవిత, నిర్మల, భార్గవి, తిరుపాల్, అజయ్ బాబు, సురేష్‌బాబు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని బలవన్మరణం

పది ఫలితాల భయంతో అఘాయిత్యం



సాకే వైష్ణవి (ఫైల్)

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన సాకే కృష్ణయ్య, ధనలక్ష్మి దంపతుల కుమార్తె సాకే వైష్ణవి(15) పదో తరగతి పరీక్షలు రాసింది. పాసవుతానో, కానోననే భయంతో ఆమె మథన పడుతుండేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనికి బయటకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న వైష్ణవి మధ్యాహ్నం ఫ్యాన్‌కొక్కికి చీరతో ఉరి వేసుకుంది. వైష్ణవి తండ్రి కృష్ణయ్య సాయంత్రం ఇంటికి వెళ్లగా, తలుపులు వేసి ఉండటంతో కిటీకిలో నుంచి చూశాడు. ఉరికి వేళాడుతున్న కుమార్తెను చూసి కంగారుగా ఇంటి తలుపులు పగులగొట్టాడు. వైష్ణవిని కిందకు దించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థుల ఆటో బోల్తా

15 మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

బొమ్మనహాళ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాపురం గ్రామ సమీపంలో మలుపు వద్ద మంగళవారం పాఠశాల విద్యార్థుల ఆటో బోల్తా పడి 15 మంది గాయపడ్డారు. మండలంలోని కానాపురం, కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు డీ హీరేహాళ్ మండలం సోమలాపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆటోలో రోజూ పంపించేవారు. మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులు పాఠశాల నుంచి స్వగ్రామాలకు వస్తుండగా కానాపురం సమీపంలోని మలుపు వద్ద డ్రైవర్ చంద్ర నిర్లక్ష్యంతో బోల్తా పడింది. దీంతో శ్రీశాంత్, కావ్యశ్రీ, జయలత, భూమిక, గణేష్, హుస్సేన్, కావేరితోపాటు మరో ఎనిమిది మంది విద్యార్థులు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. ప్రాణపాయం తప్పినట్లు తెలిపారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

కానిస్టేబుళ్లే బలి..!



అవినీతి మరకలున్న ఎస్ఐలు, సీఐలపై చర్యలు శూన్యం
పది నెలల వ్యవధిలో ఇది రెండోసారి..
వీఆర్‌కు ఆదేశాలిచ్చిన వారిపైనా సిఫార్సులు
స్పెషల్ బ్రాంచ్ నివేదికల్లో ఏముంది..?



అనంతపురం క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో అవినీతి మరకలున్న అధికారులపై చర్యలు లేవు. కిందిస్థాయిలో పనిచేస్తున్న కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లపై చర్యలకు ఉపక్రమించడం విమర్శలకు తావిస్తోంది. పోలీసు స్టేషన్లలో ఫైసల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించేది ఎస్ఐలు, సీఐలే. ఇదంతా బహిరంగ రహస్యమే. అలాంటి వారిని ఉపేక్షించి తాజాగా కింది స్థాయి సిబ్బందిని వీఆర్‌కు తీసుకురావడం, ఆ క్రమంలోనే సంబంధిత పోలీసు స్టేషన్ నుంచి బదిలీ చేయడం జరిగిపోయింది. పది నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇలా చేస్తున్న పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఏం మెసేజ్ ఇస్తున్నట్లో అర్థం కావడం లేదు. ఎవరి నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకున్నారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ), లా అండ్ ఆర్డర్‌లో పనిచేసే వారి నుంచి నివేదిక తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. లా అండ్ ఆర్డర్‌లో ఎవరెలాంటి నివేదిక ఇస్తారో తెలిసిపోతుంది. ఇక ఎస్బీ.. ఎస్ఐ, సీఐలపై నివేదిక ఇవ్వలేదా..? ఇచ్చినా పోలీసు యంత్రాంగం పక్కన పెట్టిందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్బీలో కొందరు సిబ్బంది దీర్ఘకాలంగా పని చేస్తున్నారు. ఆ క్రమంలో వారికి కూడా పరిచయాలు మరోలా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి పోలీసు అధికారులు ఎస్ఐ ఆపైస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది.

అంతటి నిజాయితీపరులా...?

పోలీసు శాఖపై ఎప్పటి నుంచో అలవాటుగా మారిందనే విమర్శను మరోసారి మూటగట్టుకున్నారు. తాజాగా నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు తీసుకెళ్లారు. ఏదైనా వివాదంగానీ, శాఖకు మచ్చ తెచ్చే సందర్భాల్లో చిన్న స్థాయి ఉద్యోగులపైనే వేటు వేస్తారనే అపవాదు ముందు నుంచీ ఉంది. పోలీసు స్టేషన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)లు కీలకం. ఎస్ఐ, సీఐలే ఆ సీట్లలో ఉంటారు. వారు చేయని అవినీతి కిందిస్థాయి సిబ్బంది ఎలా చేస్తున్నారో అర్థం కావడంలేదు. మద్యం దుకాణాల నుంచి ప్రతినెలా మామూళ్లు, సెటిల్‌మెంట్లు, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పేకాట ఇలా అన్ని వ్యవహారాల్లో తలదూర్చే పోలీసు అధికారులు జిల్లాలో బాగానే ఉన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఆరునెలలకే అతనెలాంటి అధికారో ఆ మండల, స్టేషన్ పరిధిలోని ప్రజలే చెబుతారు. అలాంటిది ఇంత వ్యవస్థ ఉన్న పోలీసు యంత్రాంగానికి ఎస్ఐ, సీఐల అవినీతి తెలియకుండా ఉంటుందనడం అతిశయోక్తే. గత పది నెలల్లో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవడం ఇది రెండోసారి. గతేడాది ఆఖరులో 15 మందిపై చర్యలు తీసుకున్నారు. మరోసారి 11 మందిని వీఆర్‌కు తీసుకెళ్లి, బదిలీ చేశారు. ఇప్పటివరకు ఎస్ఐ, సీఐలపై మాత్రం చర్యల్లేవు. తాజాగా బుక్కరాయసముద్రంలో అధికార పార్టీ నాయకుడిపై చేయి చేసుకున్నాడనే నెపంతోనే సీఐపై చర్యలు తీసుకున్నారనే విమర్శలున్నాయి. ఇలా ప్రతిసారీ కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకున్నంత కాలం ఆ ఎస్ఐలు, సీఐలు అవినీతిలో మరింత ముదిరిపోతారనడంలో సందేహం లేదు.

వీఆర్‌కు తీసుకొచ్చిన వారిపైనా సిఫార్సులు...

వీఆర్‌కు తీసుకొచ్చిన కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల విషయంలోపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లపై చర్యలకు ఉపక్రమించారు. ఇక్కడ కూడా కొందరు సిఫార్సులు చేసి వీఆర్‌కు, బదిలీపై వెళ్లకుండా తప్పించుకున్నట్లు సమాచారం. అధికారపార్టీ నేతలు, పోలీసు శాఖలోనే కొందరి సహకారంతో వారిపై వేటు పడకుండా చూసుకున్నట్లు తెలిసింది. వారిలో అనంతపురం, ఉరవకొండలో ఒక్కో కానిస్టేబుల్‌తోపాటు మరి కొందరున్నట్లు సమాచారం. కళ్యాణదుర్గం పరిధిలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌పై విపరీతమైన ఆరోపణలు వచ్చాయి. ఓ సీఐ సహకారంతో ఆ కానిస్టేబుల్ బదిలీ విషయంలో ఆ సర్కిల్ దాటకుండా వ్యవహారం నడిపారు. వేటుపడిన వారిలో కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమను కనీసం విచారించకుండా ఎలా వీఆర్‌కు పిలవడం, బదిలీ చేస్తారని ప్రశ్నిస్తున్నారు. తాము తప్పు చేసి ఉంటే స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. ఎస్ఐ, సీఐల స్థాయి కంటే హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఎక్కువ అవినీతి చేస్తారా...? అనే ప్రశ్నకు పోలీసు ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి.

స్పెషల్ బ్రాంచ్ నివేదిక ఏమవుతోంది...?

పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) ఇచ్చిన నివేదికే ఫైనల్ తీసుకుంటున్నారా..? వాటిని బుట్టదాఖలు చేస్తున్నారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు శాఖలో ఎస్బీ చాలా కీలకం. ఈ విభాగంలో ప్రభుత్వం మారాక కీలకమైన సీఐలు మారి కొత్తవారు వచ్చారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో హెడ్‌కానిస్టేబుల్ స్థాయిలో ఒకరు ఎస్బీ తరఫున పనిచేస్తారు. జిల్లాలోని దాదాపు 80శాతం పోలీసు స్టేషన్లలో దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారే ఉన్నారు. వీరందరికీ ఆ పోలీసు స్టేషన్‌పై పట్టు ఉంటుంది. సీఐ, ఎస్ఐ స్థాయి అధికారుల వ్యవహారం తెలిసే ఉంటుంది. మరి వారిపై ఎస్బీ సిబ్బంది రిపోర్ట్ స్పష్టంగానే ఉంటోందా..? అనేది అంతుబట్టడం లేదు. వారి కనుసన్నల్లోనే ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ ఇద్దరు, ముగ్గురు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు డబ్బుల వ్యవహారం నడుపుతుంటారు. ఎస్బీ ఇచ్చిన నివేదికలు స్పష్టంగా ఉంటే పోలీసు యంత్రాంగం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నకు సమాధానం లేదు. ఎస్బీలోనూ కొందరు పోలీసు శాఖలో ఉన్నతాధికారులకు సహకరిస్తుంటారనే ఆరోపణలున్నాయి. వైసీపీ హయాం నుంచి ఎస్బీలోనే అధిక శాతం పనిచేస్తున్నారు. మరికొందరు ఆ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు కీలకంగా పనిచేసే కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కై మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు లేకపోలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలు దాటినా ఇప్పటి వరకు ఒక్క ఎస్ఐ, సీఐపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

వక్ఫ్ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు సరికాదు

చంద్రబాబు, పవన్ కల్యాణ్ నోరు విప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపాటు



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చారో చెప్పాలంటూ నిలదీశారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన ఉమ్మడి జిల్లా సీపీఐ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ మతాల మధ్య చిచ్చు పెట్టి, మైనార్టీలను టార్గెట్ చేస్తూ ఏదో చేయాలని చూస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై దేశవ్యాప్తంగా మైనార్టీలు, లౌకిక వాదులు నిరసన గళం విప్పుతున్నారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26ను కేంద్రం ఉల్లంఘిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో సైతం ఇతర మతస్థులను పెట్టాలని చూడటం సరికాదన్నారు. ఇది ముస్లింలతోనే ఆగదని, తర్వాత క్రిస్టియన్ ప్రాపర్టీలు, దేవదాయ భూములను టార్గెట్ చేస్తారంటూ విమర్శించారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన సవరణలు వక్ఫ్ బిల్లులో అమలు చేయకపోయినా ఎందుకు ఆమోదం తెలిపారో చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ వేషం మార్చి సనాతనవాదిని అంటూ కాషాయం డ్రెస్సులు వేసుకుని, పూర్తిగా బీజేపీ అజెండాతో నడుస్తున్నాడని మండిపడ్డారు. తిరుపతి గోశాలలో గోవుల మృతిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన చేసిన ఆరోపణలపై సున్నితంగా పరిష్కరించాల్సింది పోయి, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఆట్లాడటం సరికాదన్నారు. దేశంలోని బ్యాంకుల్లో వేల కోట్లు కొల్లగొట్టి విదేశాలకు పారిపోయిన కోటీశ్వరులు సుమారు 20 మంది వరకూ ఉన్నారని, వాళ్లను రప్పించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఇతర నేతలు కేశవరెడ్డి, లింగమయ్య, రమణయ్య, సంతోష్‌కుమార్, అల్లిపీరా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు టౌన్(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో మంగళవారం వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ రజాక్ పీర్, అదనపు ఖాజీ సత్తార్‌సాబ్, ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్, వైసీపీ నాయకులు హాజరయ్యారు. జగదీష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ నిరంకుశ పాలనకు కొందరు జీహుజూర్ అంటున్నారన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర అన్యాయం వాటిల్లుతుందన్నారు. కులమతాలకు అతీతంగా వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకునేలా కేంద్రంపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్ పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,560 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 774 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేపడతామని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారరావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని క్లాక్ టవర్ సమీపంలో గల ఓహోటల్లో మంగళవారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి వైద్యసిబ్బందికి అనేక యాప్‌లు పెట్టి పని చేయించడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్దుబాటు చేసిన ఉద్యోగులకు చాలాచోట్ల జీతాలు రావడంలేదని ఆ సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆసంఘం నాయకులు బాబాసాహెబ్, నూర్‌బాషా, ప్రకాష్ చౌడప్ప, సావిత్రి, ఫయాజ్, విశ్వనాథ్, ముంతాజ్, త్రివేణి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

18న దివ్యాంగుల క్రికెట్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 18న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు శంకరనారాయణ తెలిపారు. ఆసక్తి, అర్హతగల దివ్యాంగ క్రీడాకారులు ఆధార్ కార్డు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 9703400870, 6305354511, 9398509469 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎంపికైన దివ్యాంగ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

సీఐ డ్రైవరే దొంగ!

మూడు వరుస చైన్‌స్నాచింగ్‌లు ఇతడి ఘనతే

పోలీసుల అదుపులో ఐదుగురు చైన్‌స్నాచర్ల ముఠా

నేడు మీడియా ముందుకు..

అనంతపురం క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా మూడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన దొంగ ఓ సీఐ డ్రైవర్‌గా పని చేసినట్లు సమాచారం. ఆ సీఐ ఆ దొంగకు గతంలో ఇచ్చిన బైక్‌నే చైన్ స్నాచింగ్ లకు ఉపయోగించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడితో పాటు మరో రెండు బృందాల చైన్‌స్నాచర్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే ఓ వ్యక్తి గతంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే అధికారులకు డ్రైవర్‌గా పని చేసేవాడు. అదే క్రమంలో ఓ అధికారికి డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో ఆ అధికారి అతడికి తాను వాడే బైక్ ఇచ్చారట. ప్రస్తుతం ఆ సీఐ ఓ ప్రత్యేక విభాగంలో పని చేస్తున్నారు. అనంతపురం నగరంలోని మూడో రోడ్డుకు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ భార్య దేవి వారం రోజుల కిందట రాప్తాడుకు స్కూటీలో బయలుదేరారు. నగరశివారులోని హార్మోన్‌సిటీ సమీపంలో ఓ దొంగ అటకాయించి ఆమె మెడలోని మూడుతులాల బంగారు గొలుసు తస్కరించాడు. ఈ ఘటనపై పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా అతను వాడిన బైక్ ఆధారంగా వివరాలు ఆరా తీశారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తే.. ఈనెల ఏడో తేదీ తపోవనం సమీపంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రావణి మెడ నుంచి మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లింది కూడా అతనేనని తేలింది. రెండు వారాల రోజుల కిందట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ నడిచి వెళ్తుండగా ఒకటిన్నర తులం బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఈ మూడు ఘటనలకు పాల్పడిన దొంగను సంబంధిత సీఐ విభాగం సిబ్బందే అదుపులోకి తీసుకుని విచారించార ట. పోలీస్ అధికారులకు డ్రైవర్‌గా పనిచేసిన ఈ దొంగ మరెన్ని ఘటనలకు పాల్పడ్డాడో పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ముఠా...

ప్రస్తుతం పోలీసులు మరో రెండు చైన్‌స్నాచర్ల ముఠాలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఓ గ్రామ సమీపంలో వృద్ధురాలిని గాయపరిచిన దొంగ ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఆ వృద్ధురాలు గాయపడి కొంతకాలానికే మృతి చెందింది. ఆ ఘటనకు పాల్పడిన ఇద్దరు దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరితో పాటు మరో ఇద్దరి ముఠాను అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వీరిలో ఎక్కువ మంది ఐపీఎల్ నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడి ఆ బంగారాన్ని అమ్మి సొమ్ము చేసుకోవాలని భావించి పోలీసులకు దొరికిపోయారు. వారిని బుధవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

పామిడి విద్యార్థినికి మంత్రి లోకేశ్ అభినందన

పామిడి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మహేంద్రకర్ ధృతికాబాయి ఎంపీసీలో 987 మార్కులు సాధించడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అభినందించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ధృతికాబాయిని మంత్రి మంగళవారం అభినందించి, గోల్డ్ మెడల్, ల్యాప్‌టాప్ అందజేశారు. పట్టణానికి చెందిన మహేంద్రకర్ శ్రీనివాసరావు, రమాబాయి దంపతుల కుమార్తె ధృతికాబాయి ఎమ్మిగనూరు ఏపీఆర్‌జేసీ బనవాసి గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుతోంది. ఇంటర్మీడియట్ ద్వితీయ పరీక్షలు రాసింది. పరీక్షల ఫలితాల్లో ఏకంగా 987 మార్కుల సాధించి, శెభాష్ అనిపించుకుంది.



ధృతికాబాయికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

జిల్లా న్యాయాధికారికి ఎస్పీ సన్మానం



జిల్లా న్యాయాధికారిని సన్మానిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్‌ను ఎస్పీ జగదీష్ సన్మానించారు. జిల్లా న్యాయాధికారి బంగ్లాకు ఎస్పీ మంగళవారం వెళ్లి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. పోలీసు, న్యాయశాఖలు పరస్పర సహకారంతో నేరస్థులకు శిక్షలు పడేలా చేయడాన్ని గుర్తుచేశారు.

ఖో-ఖోలో ఎస్కేయూ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ఆర్ జాతీయస్థాయి ఖో-ఖో పోటీల్లో ఎస్కేయూ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కడప కేఎస్ఆర్ఎం కళాశాలలో ఈనెల 12 నుంచి మూడు రోజులపాటు జాతీయస్థాయి పోటీలను నిర్వహించారన్నారు. పోటీల్లో ఇంజనీరింగ్ జట్టు రన్నర్‌ఎగా నిలిచిందన్నారు. మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.. విద్యార్థులను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి శివానంద, అధ్యాపకులు షాషావలి, రాజేష్‌బాబు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 227135

ఉచిత విద్యావకాశాలు
ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing), B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ :9030661651.
AJA- 227142

ఉద్యోగావకాశాలు
SBI లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ నందు 10th,inter పాసై25 సం॥ పైబడిన స్త్రీ, పురుష అభ్యర్థులు అడ్వైజర్లుగా కావలెను నెలకు కనీస ఆదాయం 30000/- ఏదైనా వృత్తి, ఉద్యోగం, వ్యాపారం, చేసుకొనేవారు, గృహిణిలు, రిటైర్డ్ అయినవారు కూడాజాయిన్ అవ్వచ్చు వెంటనే సంప్రదించండి. Cell:90637 91808.
AJA-227141

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926
AJA-227144

కావలెను
ATP టౌన్ నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ కావలెను. M.S.Office నందు అనుభవం తెలుగు,హిందీ భాష కూడా మాట్లాడగలగాలి. యువకులకు మాత్రమే కావాలి. సంప్ర: 9381838140, 8977731455
AJA-Satish

TO-LET
అనంతపురం నందు RDT మెయిన్ ఆఫీసు ఎదురుగా ఉన్న షాపు 30X30 900 చ.అ. మరియు ఓపెన్ ప్లేస్. 90X30 2700 చ.అ. గేటుతో పాటు కాంపౌండ్ గోడ కలదు. సంప్ర: 9885513776
AJA-Satish

కావలెను
SV మోటార్స్, సోనాలికా ట్రాక్టర్ షోరూం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌లు కావలెను. కణేకల్లు, బొమ్మనహాల్, డీ హీరేహాళ్, బెళుగుప్ప, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లో కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సెల్ నెం : 9959659907
AJA-Sathish

FLAT FOR SALE
2BHK Flat for sale at Gokulam Residency, Hari Hara Temple Road, Ashok Nagar, ATP. Flat No : 306 With Car Parking. Cell :9849636046.
AJA-SATHISH

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరా లయంలో మంగళవారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులకు అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యని ర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ

నార్పల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం ఉదయం 10గం టలకు సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ఎర్రనాగప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బండా రు శ్రావణిశ్రీ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయ నున్న ట్లు తెలిపారు. కావున రైతులు, అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు, కూటమి నాయకులు హాజరు కావాలని కోరారు.

నియామకం


మారుతి నరసింహ, పొన్నతోట రమేష్

నార్పల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన పొ న్నతోట రమేష్, రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శిగా మారుతి నరసింహ నియమితులయ్యారు. రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శిగా మారుతి నరసింహ మంగళవారం ఏలూరులో ప్రమాణ స్వీకారం చేశారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కా రానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని వారు పేర్కొన్నారు. తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపిక చేసిన రాష్ట్ర అడ్వైజర్ కమిటీ చైర్మన్ దుర్గాప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మ, రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌కు రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఖాజీగా షేక్ నూర్ మహ్మద్...


నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరంలోని 49, 50 వ డివిజన్ల ఖాజీగా షేక్ నూర్‌మహ్మద్ నియమితులయ్యారు. అర్హులైన ఇమామ్‌లకు ఖాజీలుగా అవకాశం కల్పిస్తామని ఎన్నికలకు మునుపు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ మేరకు ఎమ్మెల్యే ఖాజీగా నూర్ మహ్మద్‌ను ప్రతిపాదించగా ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంగళవారం టీడీపీ అర్బన్ కార్యాల యంలో నూర్ మహ్మద్‌కు ఖాజీగా నియామకపు పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా పావని

అనంతపురం క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంసథ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న వెంకటేశ్వర్లును హిందూపు రం మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ పోస్టుకు బదిలీ చేశారు. వెంకటేశ్వర్లు స్థానంలో డిప్యూటీ కమిషనర్‌గా పావనిని నియమించారు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)గా, చింతలపూడి నగరపంచాయతీ కమిషనర్‌గా ఉన్న పావనిని అనంతపురం డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇక శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఉన్న సతీష్‌ను రెగ్యులర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆర్థిక సంఘం సమావేశానికి రాప్తాడు సర్పంచ్

రాప్తాడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం జరిగే 16వ ఆర్థిక సంఘం కమిషన్ సమావేశానికి ఉమ్మడి అనం తపురం జిల్లా నుంచి రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు హాజర వుతున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఈ సమావేశానికి ఢిల్లీ నుంచి 16వ ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ తదితరులు హాజరవుతారన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు తమ సలహాలను ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్‌కు తెలియచేస్తారని తెలిపారు.

నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే మానసిక, శారీరక వైకల్యమున్న కుమార్తెతో కలిసి జీవిస్తున్న నిరుపేద మహిళకు నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు నిత్యావస రాలు అందజేసి అండగా నిలిచింది. ఆత్మకూరుకు చెందిన రాణి అనే మహిళకు దివ్యాంగురాలైన కుమార్తె తప్ప ఎవరూ లేరు. ఆర్థిక కష్టాలలో ఉన్న ఆమె చేయూతకోసం నిత్యసురభి ట్రస్టును ఆశ్రయించింది. దీంతో మంగళవారం ఆదర్శనగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి చేతులమీదుగా రాణికి రెండు నెలలకు సరిపడా 33 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు.

బాల్య వివాహాలు వద్దు

నార్పల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు వద్దని, యుక్తవయస్సులో వివాహాలు చేయడం క్షేమకరమని డాక్టర్ కె. హాజీరా, జిల్లా ఆరోగ్య విద్యాబోధకురాలు ఎస్ పర్వీన్ పేర్కొ న్నారు. నార్పల మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామ సచి వాలయంలో మంగళవారం లింగ వివక్ష, బాల్య వివాహ రద్దు చట్టాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీరాములు, అనసూయమ్మ, ఆరోగ్య కార్యకర్తలు మల్లేశ్వరి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పెరగాలి

రాప్తాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెంచాలని ఎంఎంటీఎల్ భూపాల్‌రెడ్డి తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రాప్తాడు సమీపంలోని వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పశువుల పేడ ద్వారా ఎరువులు తయారీ విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సునిత, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం


ఆఫర్ లెటర్స్‌తో విద్యార్థులు

నార్పల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కంపెనీల ఆఫర్ లెటర్స్‌ను మంగళవారం అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీహరికోట లోని షార్ సెం టర్ సైంటిస్ట్ జీ రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులందరికి రాయల్ ఎన్ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగాలు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి అశోక్‌రామన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోతులయ్యకు బోనాలు


రుద్రంపేటలో బోనాలు మోసుకెళుతున్న భక్తులు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రం పేటలో వెలసిన పోతులయ్య స్వామికి గ్రామస్థులు పెద్ద ఎత్తున బోనాలె ల్లారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మంగళవారం స్వామి నైవేద్యం సిద్ధం చేసుకుని మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని గ్రామంలో ఊరే గింపుగా స్వామి ఆలయం చేరుకున్నారు. వీధుల్లో ఎటుచూసినా మహిళల నెత్తిన బోనం కుండలే కనిపించాయి. ఆ రీతిగా గ్రామస్థులు బోనాలు తీసుకెళ్లారు. స్వామి వారికి నైవేద్యం పెట్టి పూజలు చేశారు. స్వామివారికి జంతుబలి ఇచ్చారు. బోనాల నేపథ్యంలో ఆలయ ప్రదేశం, రుద్రంపేట-ఆలమూరు ప్రధాన రోడ్డు భక్త జనంతో కిక్కిరిసిపోయింది.


పూజలందుకున్న పోతులయ్య స్వామి

● శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో మంగళవారం గ్రామస్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు సోమవారం వనభోజనాలు నిర్వహించి, ఆనవాయితీ ప్రకారం మంగళవారం గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. మూగజీవాలను బలిఇచ్చి విందు కార్యక్రమాలు నిర్వహించారు.


చిన్నజలాల పురంలో బోనాలు మోసుకెళుతున్న భక్తులు

పది నెలల్లో అభివృద్ధి ఏమిటో చూపించాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


శారదా నగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పది నెలల్లోనే అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉంటుందో చూపించామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం ముందుగా గంగానగర్‌లో తాగునీటి పైపులైన్‌కు భూమి పూజ చేశారు. అనంతరం శారదా నగర్‌లో రూ. 56 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి, విజయనగర్ కాలనీలో రూ.28. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగరంలో ఎక్కడా రోడ్డు సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. పది నెలల్లో ఇంత అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నాయకులు విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, టీడీపీ నాయకులు గంగారామ్, జయరాంనాయుడు, హరిత, ఉదయ్, బాబాఫక్రుద్దీన్, బాలాంజినేయులు, రాయల్ మధు, రమేష్, గుర్రం నాగభూషణం, పీఎల్ఎన్‌మూర్తి, పరమేశ్వరన్, బోయపాటి బాలప్ప, బొమ్మినేని శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎమ్మెల్యేని గంగానగర్‌లో కలిశారు. అర్బన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, ప్రకాష్‌రెడ్డి, వెంకటనారాయణ కలిసి వినతిపత్రం సమర్పించారు.

టీడీపీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు అందజేస్తున్న ఎమ్మెల్యే

శింగనమల ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా కల్పిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మంగళవారం అనంతపురం లోని కాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ కార్డులను నియోజకవర్గంలోని పలువురు కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ... నియోజకవర్గంలో సభ్యత్వాలు ఎక్కువ శాతం చేసినందున నా యకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, జిల్లా అధికారప్రతినిధి డేగల కృష్ణమూర్తి, నాయకులు మారుతినాయుడు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆది నారాయణ, బండిపరశురం, రహింతుల్లా తదితరలు పాల్గొన్నారు.

పంటల నష్టాన్ని అంచనా వేయండి : ఎమ్మెల్యే

శింగనమల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలకు జరిగిన పంటల నష్టాన్ని అంచనా వేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అధికా రులను అదేశించారు. రెండు రోజుల నుంచి నియోజకవర్గంలోని నార్పల, పుట్లూరు తదితర మండలాల్లో భారీ ఈదులు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో సాధరణ పంటలు, హార్టికల్చర్ పంటలు దెబ్బతిని రైతు లు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఎక్కడైనా దెబ్బతిని ఉంటే మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆ శాఖాధికారులకు సూచించారు.

'ప్రభుత్వ నిర్ణయంతో ఎస్సీలకు పూర్వ వైభవం'

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిని కల్పించి ఆర్థిక సాధికారతను పెంపొందించేలా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయడంతో ఎస్సీలకు పూర్వవైభవం రానుందని ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ అక్కులప్ప మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో సీఎంగా జగన్‌కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.59.35కోట్ల నిధులతో 1427 యూనిట్లను కేటాయించడం స్వాగతిస్తున్నా మని తెలిపారు. అయితే యూనిట్లను పారదర్శకంగా అర్హులకు అందజేస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. సిఫార్సులకు తలొగ్గితే ఎస్సీల వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఆటో బోల్తా...ఒకరి మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):ఆటో బోల్తా పడి ఒకరు మృ తి చెందగా, నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతపురం రూరల్ మండలం కందుకూరు నుంచి మంగళవారం ప్యాసింజర్ ఆటో అనంతపు రం బయలుదేరింది. అందులో కందుకూరుకు చెందిన వెంకటరాముడు (53) మరికొందరు ప్రయాణిస్తున్నారు. కొంత దూరం రాగానే ఆటో అదుపు తప్పి బోర్లా పడడంతో కింద పడిన వెంకటరాముడు తీవ్రగాయమై అక్కడి కక్కడే మృతి చెందాడు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కొడుకు సంతానం. ఆ టో డ్రైవర్ బత్తర్‌కు తీవ్రగాయాలు కాగా, దేవమ్మ, రమాదేవి, మనోహరమ్మ కు స్వల్పగాయాలయ్యాయి. ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణకు అవగాహన తప్పని సరి అని ఏడీఎఫ్‌ఓ లింగమయ్య పేర్కొ న్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో అగ్ని ప్రమాదాల నివారణపై విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. క్లాక్‌టవర్ సర్కిల్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అప్రమత్తత ద్వారా అ గ్నిప్రమాదాలను నివారించగలమని ఏడీఎఫ్‌ఓ పేర్కొన్నారు. లీడింగ్ ఫైర్ మ్యాన్‌లు రమేష్‌కుమార్ రెడ్డి, వీరేష్ గౌడ్, ఫైర్‌మ్యాన్‌లు తిప్పేస్వామి, వంశీకృష్ణ, రమేష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో అందరిని కలుపుకొని పోవాలి : ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాయకు లు, కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకెళ్లాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆయన మంగళవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో నియోజకవర్గం పరిశీలకులు లక్ష్మీనారా యణ ఆధ్వర్యంలో ముఖ్యనాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ని యోజకవర్గంలో చేసిన సభ్యత్వాలు, ఇప్పటి దాకా సభ్యత్వ కార్డుల పంపిణీ, డివిజన్లల్లో పార్టీ పరిస్థితులపై చర్చించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఏదో రకంగా న్యాయం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని వారు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నాయకులు గంగారామ్, సరిపూటి రమణ, ముక్తియార్, నారాయణస్వామి యాదవ్, గోపాల్ గౌడ్, వన్నూరప్ప, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఓపెన్ సైట్స్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, ఇందుకు నెలరోజులు డెడ్‌లైన్ విధిస్తున్నానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నగర కమిషనర్ బాలస్వామి, ఇతర విభాగాల అధికారులతో సమావేశమ య్యారు. నగరంలోని సమస్యలపై చర్చించారు. కార్పొరేషన్ స్థలాల ఆక్ర మణలు, అక్రమ కట్టడాలపై ఫిర్యాదులొస్తున్నా ఎందుకు చర్యలు తీసుకో వడం లేదని ప్రశ్నించారు. చెత్త సేకరించే వాహనాలు కొన్ని కాలనీలకు వెళ్లడం లేదని తెలిసిందన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈలు షాకీర్, నరసింహులు, టీపీఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పి-4 సర్వే బూటకం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చెబుతున్న పి-4 సర్వే బూటకమని అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. అనంతపురం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పి-4 విధానం ద్వారా పేదరికాన్ని పోగొడతామని సీఎం చంద్రబాబు ఒకే రికార్డు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. పేదరికం ఎందుకు వస్తోంది, పేద లు, ధనికుల మధ్య తారతమ్యాలు ఎందుకు ఉన్నాయో చెప్పకుండా.... పి-4 సర్వే, పేదరికానికి లింకు పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. కొందరు షావుకార్ల దగ్గర ఉన్న డబ్బులు తీసుకుని పేదలకిస్తే.. పేదరికం పోతుందని సీఎం చెప్పడం ప్రజల చెవిలో వందశాతం పూలు పెట్టడమేనని అన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అవలంబిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగానే దేశంలో, రాష్ట్రంలో పేద, ధనిక తారతమ్యం పెరుగుతోందని మండిపడ్డారు. ఆ సర్వేకు బంగారు కుటుంబం, మార్గదర్శి అంటూ ఏవో పేర్లు చాలా బాగా పెట్టారని ఎద్దేవా చేశారు. పి-4 సర్వేతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ శక్తులకు డబ్బులు దోచిపెట్టి, ప్రజలను భిక్షగాళ్లను చేస్తున్నారని మోదీ, చంద్రబాబుపై మండిపడ్డారు. దేశవ్యాప్తంగా అందరూ వ్యతిరేకిస్తున్న వక్ఫ్ సవరణకు బిల్లుకు సైతం బీజేపీ, జనసేన మద్దతు ఇవ్వడం సరికాదని అన్నారు.

కేసులు బయటకుపోతే మీదే బాధ్యత

● హెచ్ఓడీలకు సూపరింటెండెంట్ హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చికిత్సకోసం ఆస్పత్రికి వచ్చిన కేసులు బయట ప్రైవేట్ ఆస్పత్రులకు ఎలా వెళుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వర రావు హెచ్ఓడీలను ప్రశ్నించారు. అలా కేసులు బయటకు వెళితే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కంటి చికిత్స కోసం వచ్చిన పేషెంట్లను పైసల కోసం ప్రైవేట్ ఆస్పత్రికి పంపిన ఇద్దరు డాక్టర్ల తీరుపై ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైన విష యం విదితమే. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ మంగళ వారం ఆస్పత్రిలోని అన్ని విభాగాల హెచ్ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఇక్కడి రోగులను బయటి ఆస్పత్రులకు పంపడం దుర్మార్గమన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. సమావేశంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి, ఆర్ఎంఓలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

వడ్డీతోనే బంగారం రుణాలను రెన్యువల్ చేయాలి

● బ్యాంకు ఎదుట రైతుల నిరసన


బ్యాంకు ఎదుట నిరసన చేపట్టిన రైతులు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో బంగారం రుణాలకు సంబంధించి కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలంటూ రైతులు స్థానిక కెనరా బ్యాంకు ఎదుట నిరసనకు దిగారు. రైతుసంఘం మండల నాయకుడు లింగన్న ఆధ్వర్యంలో బ్యాంకు పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం బ్యాంకు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకుడు లింగన్న మాట్లా డుతూ... ప్రస్తుతం రైతుల పరిస్థితి కడు దయనీయంగా ఉందన్నారు. పంట లు పూర్తిగా దెబ్బతిని అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకుల్లో బంగారం రుణాలకు సంబంధించి అసలు, వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇది ఆసరా చేసుకుని చాలా మంది దళారులు రైతుల నుంచి సొమ్ము చేసుకుం టున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన మరిం త ఉధృతంచేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్య నారాయణ బ్యాంకు వద్దకు చేరుకుని సమస్యపై రైతులు, బ్యాంకు అధికా రులతో చర్చించారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని బ్యాంక్ మేనేజర్ ప్రియదర్శన్ అనూప్ తెలుపడంతో రైతులు నిరసన విరమించారు.

కన్నులపండువగా రాములోరి శయనోత్సవం


శయనోత్సవంలో సీతారాములు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులో ని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మంగళవారం సాయంత్రం రాములవారి శయనోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్ర హ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఉదయం హనుమ ద్ సమేత సీతారామ లక్ష్మణ మూలవిరాట్లకు వివిధ అభిషేకాలతో పాటు సుదర్శనహోమం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు గంధాభిషేకం, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మోత్స వాల ముగింపు సూచికగా ధ్వజావరోహణ చేశారు. సాయంత్రం ఆలయంలో స్వామివార్లకు శాస్త్రోక్తంగా శయనోత్సవ సేవ నిర్వహించి ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, భక్తమండలి నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు చౌదరి, జీజే వేణు, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, హర్ష, భక్తులు పాల్గొన్నారు.

తిరుమలలో భక్తులకు సౌకర్యాలు అమోఘం

● ఎమ్మెల్యే పరిటాల సునీత


వెంగమాంబ నిత్యాన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తు లకు అందిస్తున్న సౌకర్యాలు అమోఘమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆమె మంగళవారం తన కుటుంబ సభ్యులు, శ్రేయోభి లాషులతో కలిసి తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడి అర్చకులు వారిని ఆశీర్వదించారు. అనంతరం వెంగమాంబ నిత్యాన్నదాన సత్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఇదే క్రమంలో ఆమె భక్తులను పలుకరించి, అక్కడి సౌకర్యా లు, లడ్డూ నాణ్యతపై ఆరా తీశారు. గతంలో కంటే సౌకర్యాలు బాగున్నాయని భక్తులు చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు.

సర్వే రాళ్ల ధ్వంసం.. నలుగురిపై కేసు

శింగనమల, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): అధికారులు నాటిన సర్వేరాళ్లను ధ్వంసం చేసిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని జూ ల్వా కాలువ రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 114 లో ఆదేగ్రామానికి చెం దిన సుధీర్‌నాయుడు, తలారి లక్ష్మన్న మధ్య వాదనలు జరుగుతు న్నాయి. వారం రోజుల కిందట మండల సర్వేయర్, తహసీల్దార్, పోలీ సులు వెళ్లి 114 సర్వే నంబర్‌లో సుధీర్ నాయుడు, లక్ష్మన్న సమక్షంలో కొలతలు తీశారు. సుధీర్ నాయుడు 75 సెంట్ల భూమిని లక్ష్మన్న కబ్జా చేశాడని తేల్చి, అధికారులు ఆ భూమికి సర్వేరాళ్లు పూడ్చిశారు. సుధీర్ తనకు వచ్చిన భూ మి చుట్టూ ఫెన్సింగ్ రాళ్లు పూడ్చించారు. అయితే మూడు రోజుల కిందట సర్వేరాళ్లను, ఫెన్సింగ్ రాళ్లను తలారి లక్ష్మన్న, మహేశ్, నారాయణస్వామి, సాయి అనే నలుగురు ధ్వంసం చేశారని సుధీర్ నాయుడు శింగనమల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచార ణలో ఆ నలుగురు ధ్వంసం చేసినట్లు తేలడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మెగా డీఎస్సీ ఇవ్వకుంటే ఆందోళనలే

● డీవైఎఫ్ఐ నేతలు, నిరుద్యోగులు



డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, లేకుంటే.... ఆందోళన బాట తప్పదని డీవైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు హెచ్చరించారు. వారు మంగళవారం డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ముం దుగా ఆర్ట్స్ కాలేజ్ నుంచి ర్యాలీగా వెళ్లి డీఈఓ కార్యాలయం ఎదుట రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా కన్వీనర్ రమేష్, అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారన్నారు. అయితే పది నెలలు గడిచినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. అలాగే జిల్లాలో 1000 ఎస్‌జీటీ పోస్టులను, ఏకోపాధ్యాయ స్కూళ్లలోనూ రెండో పోస్టులను ఇవ్వాలని కోరారు. డీ వైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నూరుల్లా, సురేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, కార్యదర్శి పరమేష్, ఇతర నేతలు గిరి, బీమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని స్కూళ్లపై చర్యలు తీసుకోండి : ఏఐఎస్ఎఫ్

అనంతపురం విద్య, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అనుమతి లేకుండా నడుపుతున్న స్కూళ్లపై, ముందస్తు అడ్మిషన్ల చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మంగళవారం డీఈఓ ప్రసాద్ బా బుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఇతర నేతలు మాట్లాడుతూ...చాలా కార్పొ రేట్, ప్రైవేట్ స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి ఇప్పటికే ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను యథేచ్ఛగా అమ్ముతూ తల్లిదండ్రుల నుంచి డబ్బులు గుంజుతున్నారని తెలిపారు. ఆ సంఘం నాయకులు వంశీ, చందు, మంజునాథ్, సమీర్, పవన్ సాయి ఇతర నాయకులు పాల్గొన్నారు.

టైర్ల ఫ్యాక్టరీపైకి కూలిన పొగగొట్టం


టైర్ల ఫ్యాక్టరీపై పడిన పొగగొట్టం

శింగనమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఈదులుగాలకు స్థానిక టైర్ల మరమ్మతుల ఫ్యాక్టరీపై పొగ గొట్టం(చిమ్నీ) పడడంతో షెడ్ మెత్తం దెబ్బతింది. శింగనమల మండలం లోని ఆకులేడు గ్రామ స మీపంలో శ్రీరాఘవేంద్ర స్వామి టైర్ల మరమ్మతుల ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఈదులు గాలులతో కురిసిన వర్షానికి ఫ్యాక్టరీలో ఉన్న 100 అడుగుల పొగ గొట్టం (చిమ్నీ) గాలులకు కిం దకు పడింది. అది ఫ్యాక్టరీలోని షెడ్ మీద పడడంతో షెడ్ మెత్తం ధ్వంసం కావడంతో పాటు పొగగొట్టం పూర్తిగా విరిగిపోయింది. దీంతో దాదాపు రూ. 23 లక్షల వరకు నష్టవాటిల్లిందని యజమాని రాంబాబు అవేదన వ్యక్తం చేశాడు.

సంక్షిప్త వార్తలు

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో నిర్లక్ష్యం తగదు



ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

యాడికి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం తగదని టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం యాడికి ట్రాన్స్‌కో కార్యాలయంలో టీడీపీ నాయకులు, రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది రైతులు ఏడాది క్రితం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. స్టాక్ లేదనే కారణంతో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయలేదన్నారు. దీనివల్ల రైతులు పంట కాలాన్ని నష్టపోవాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నీలకంఠ, ఆదినారాయణ, విక్రమ్, శేఖర్, రాముడు, హరినాథ్ రెడ్డి, చెన్నకేశవ, నరసింహ, ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు కణేకల్లులో ప్రజాదర్బార్

కణేకల్లు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ప్రజాదర్బార్‌ను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ప్రజలు ఏమైనా సమస్యలుంటే ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు ప్రజాదర్బార్ ఉంటుందన్నారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

కణేకల్లులోని బిస్మిల్లా ఫంక్షన్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం టీడీపీ నాయకులు, కార్యకర్తలకు విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆనంద్‌రాజ్‌లు తెలిపారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సమావేశంలో పాల్గొంటారని, మండలంలోని కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని వారు కోరారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ఉరవకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల కేంద్రంలో చిరువ్యాపారులకు అభయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా గొడుగుల పంపిణీ చేశారు. తహసీల్దారు నయాజ్ అహ్మద్, సర్పంచ్ మోనాలిసా గొడుగులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభయా ఫౌండేషన్ రూ.2వేలు విలువ చేసే గొడుగులు ఉచితంగా పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ చెన్నకేశవ, ఎమ్మార్పీఎస్ నాయకులు బెంజిమన్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మే 20న దేశవ్యాప్త తలపెట్టిన కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో మంగళవారం సీఐటీయూ అనుబంధ ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్కాస్ రద్దు చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు సాకే నాగరాజు, రేష్మ, గంగా, శైలజ, రంగమ్మ, బాష, రాము పాల్గొన్నారు.

హుండీలోని నగదు చోరీ

గుత్తి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామం వద్ద కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ పగుల గొట్టి నగదును చోరీ చేశారు. ఆరునెలల క్రితం నిర్మించిన ఆలయంలో హుండీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి భక్తులు కానుకలు వేశారు. మంగళవారం తెల్లవారుజామున అర్చకులు పూజలు చేసేందుకు వచ్చి చూడగా హుండీని పగలగొట్టి వాటిలో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. ఘటనపై పోలీసులకు పిర్యాదు చేశారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు

గుత్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా తెలిపారు. గాంధీ సర్కిల్‌లోని దుకాణాల వద్ద వ్యాపారులకు మంగళవారం అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించిందని, వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబుబ్‌బాష, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, నాగార్జున, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు బొమ్మనహాల్ ఎంపీడీఓ విజయభాస్కర్ మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన జరిగే సమావేశనికి మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని పేర్కొన్నారు.

టీబీ వైద్య పరీక్షలు ప్రారంభం

పుట్లూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో టీబీ వైద్య పరీక్షలు ప్రారంభించినట్లు వైద్యాధికారి శ్రీవాణి మంగళవారం తెలిపారు. 15 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. టీబీ వ్యాధి సోకిన రోగితోపాటు వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన ఆటో డ్రైవర్‌కు సన్మానం

ఉరవకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ చేసి, ప్రాణాలు కాపాడిన ఆటో డ్రైవర్ చంద్రను టీడీపీ నాయకులు సన్మానించారు. పట్టణంలోని గవిమఠం రోడ్డులో ఉన్న జమీల్ ఫర్నీచర్ షాపులో ఆటో డ్రైవర్‌ను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ చంద్ర సమయస్ఫూర్తితో వ్యవహరించి సీపీఆర్ చేసి, గాయపడిన వ్యక్తిని తన ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లి, ప్రాణాలు కాపాడారన్నారు. కార్యక్రమంలో నాయకు లు జమీల్, శీన, నిరంజన్‌గౌడ్, విశ్వనాథ్, ఖాజా, మురళి పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సంపద లక్ష్యం.. అధికారుల నిర్లక్ష్యం..!

● నిరుపయోగంగా చెత్తతో సంపద తయారీ కేంద్రాలు ● రూ. 57 లక్షలు వృథా ● పారిశుధ్యానికి తొలగని ఇబ్బందులు



కంబదూరులో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రం, లోపల భాగంలో నిర్మించిన తొట్టెలు

కంబదూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచుతూనే స్వచ్ఛత వైపు నడిపించాలనే ఉద్దేశ్యంతో లక్షలు వెచ్చించి చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో ఈ లక్ష్యం నెరవేరలేదు. కంబదూరు మండలంలో వెచ్చించిన నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. మండలంలో 12 పంచాయతీలకు గాను 12 చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. నిర్మాణాలు పూర్తయిన గ్రామాల్లో వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో అవి పలుచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. చెత్త సంపద కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో గ్రామాల్లో చెత్తను సకాలంలో తరలించే వారు లేక అపరిశుభ్రం తాండవిస్తోంది. ఎంపిక చేసిన గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక స్వచ్ఛ కార్మికుడిని నియమించాలి. వారంలో ఆ గ్రామంలో రిక్షాతో ఇంటింటా తిరిగి చెత్త సేకరించి కేంద్రానికి తరలించాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేయాలి. వీటితో వర్మీ కంపోస్టును తయారు చేయాలి. ఇలా వచ్చిన సంపదతో గ్రామంలోని తాగునీరు, పారిశుధ్యం తదితర వాటికి ఖర్చు పెట్టాలి. తద్వారా గ్రామాలన్నీ స్వచ్ఛత వైపు అడుగులు వేస్తాయని ప్రభుత్వ సంకల్పం. అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఇవి నిరుపయోగంగా మారాయి.

నిధులు దుర్వినియోగం... కేంద్రాలు నిరుపయోగం..

కంబదూరు మండలంలో 12 పంచాయతీలకు గాను 12 పంచాయతీల్లో రూ. 57 లక్షలు ఖర్చు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. అంత పెద్దమొత్తం ప్రజాధనంతో నిర్మించిన కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో అపరిశుభ్రత వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

కంబదూరు మండల వ్యాప్తంగా 12 చెత్తతో సంపద కేంద్రాలు ఉన్నాయి. వాటిన్నింటిని వినియోగంలోకి తీసుకువస్తాం. ఇప్పటికే ఏఏ పంచాయతీలలో సంపద తయారీ కేంద్రాలు అధ్వాన్నంగా ఉన్నాయో ప్రణాళికలు సిద్ధం చేశాం. వాటి ఆధారంగా వాటిని పూర్తిగా వినియోగంలోకి తీసుకువచ్చి చెత్తతో సంపద సృష్టించి పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపిస్తాం.

-గూడెన్న, ఇన్‌చార్జ్ ఎంపీడీవో

ఉపాధి హామీ పథకంలో అవినీతిపై ఏపీడీ విచారణ



విచారణ చేస్తున్న ఏపీడీ విజయ్‌కుమార్

విడపనకల్లు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవకతవకలపై ఆ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. మండలంలో 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిపై ఉరవకొండ క్లస్టర్ ఏపీడీ(అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్) విజయ్‌కుమార్ మంగళవారం విచారణకు వచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో దాదాపుగా రూ. 1.19 కోట్ల అవినీతి జరిగిందని ప్రజా పరిష్కర వేదికలో విడపనకల్లు బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ శ్రీనివాసులుపై రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు మంగళవారం విచారణ ప్రారంభించారు. పాల్తూరు, కరకముక్కల, ఆర్. కొట్టాల గ్రామాల్లో పర్యటించి కూలీలను విచారించారు. కొంత మందికి సంబంధించిన జాబ్ కార్డులను పరిశీంచారు. వాటిలో వారి కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయా వేరెవరివైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నకిలీ అకౌంట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి నిధులను కాజేయటంపై పూర్తి స్థాయిలో విచారించి అవినీతి అధికారులపై జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామని విచారణకు వచ్చిన అధికారులు తెలిపారు.

ఘనంగా కువాడమ్మ జాతర



గావు కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజలు

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిల్లలపల్లిలో కువాడమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరను నిర్వహించడం వల్ల గ్రామానికి మంచి జరిగి పాడిపంటలు పండతాయని రైతులు నమ్మకం. సాయంత్రం పోతురాజుల చేత గావు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరై తిలకించారు.

● రాయదుర్గం: కాశీపురంలో మంగళవారం మారమ్మజాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించి మూడురోజుల పాటు దేవర ఉత్సవాలను నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వేదావతి హగరికి తీసుకెళ్లి పవిత్రంగా గంగపూజను నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బేదొడ్డికి చెందిన ఖాజా అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఖాజా నాలుగు సంవత్సరాల క్రితం గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో రూ.3 లక్షలు ఇచ్చాడు. ఉద్యోగం ఇప్పించలేదు, డబ్బులు ఇవ్వలేదని సోమవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పశువుల నీటి తొట్టెలు త్వరగా పూర్తి చేయాలి

యాడికి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టెల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఉపాధిహామి సిబ్బందిని డ్వామా పీడీ సలీంబాషా ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెద్దపేట వద్ద ఏర్పాటు చేస్తున్న నీటితొట్టె నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిదృష్ట్యా పశువుల దాహార్తి తీర్చడం కోసం ఉపాధిహామీ పథకం కింద నీటితొట్టెల ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా ఇప్పటివరకు 33 నీటితొట్టెల ఏర్పాటుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నీటి సరఫరా అనుకూలంగా ఉండి, పశువులు సంచరించే రస్తాలో ఎక్కడైనా తొట్టెలు అవసరమని తమ దృష్టికి తీసుకువస్తే ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ వీరరాజు, ఉపాధిహామీ పథకం ఏపీడీ పుల్లారెడ్డి ఉన్నారు.

దుర్గంలో దొంగల హల్‌చల్

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎస్వీ బార్, హిందూపురం బైపాస్‌లో ఉన్న వైన్ షాపులలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత మద్యం దుకాణాల వద్ద ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం షట్టర్లను ధ్వంసం చేయడానికి ప్రయత్నం చేసి విఫలమయ్యారు. మంగళవారం ఉదయం పట్టణ పోలీసులు క్లూస్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లోకనాథ శర్మ

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అమరావతిలో బ్రాహ్మణసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుంతకల్లు పట్టణానికి చెందిన టి. లోకనాథ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని దేవదాయ ధర్మదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంఘం అధ్యక్షుడు కొలూరు సతీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా మనోహర్‌రావు, ఉపాధ్యక్షులుగా టి. లోకనాథ శర్మ, ఆర్ వెంకటప్రభాకర్‌రావు, సీవీ సురేష్‌బాబు, కోశాధికారి పులిపాక ప్రసాద్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం పెద్దలు హాజరయ్యారు.

వైభవంగా సీతాకల్యాణం



సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) :శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పామిడి వద్ద పెన్నా నదిలోని రామాలయంలో మంగళవారం సాయంత్రం సీతారామకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది చైత్ర మాసం నవమి తర్వాత 9 రోజులకు సీతారామకల్యాణాన్ని చేస్తున్నారు. అరిగేల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధనుంజయ, వెంకటేశ్వర్లు కుటుంబాలు కల్యాణకర్తలుగా వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామి హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

గుత్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వర ఆలయంలో మంగళవారం ఆంజనేయస్వామి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆంజనేయ స్వామి, వీరభద్రస్వామి, నవగ్రహల ప్రతిష్ట, యంత్రప్రతిష్ట, విగ్రహాల సంప్రోక్షణ, ప్రాణప్రతిష్ట, కుష్మాండబలి, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పెద్దపప్పూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం కారు ఢీకొని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (63) అనే వృద్ధుడు మృతి చెందాడు. తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వెళుతుండగా కారు ఢీకొనడంతో ఎర్రిస్వామికి బలమైన గాయాలయ్యాయి. వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించినట్లు వైద్యులు తెలిపారు. పెద్దపప్పూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

బొమ్మనహాళ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుహోళ గ్రామంలో సోమన్నగౌడ్ అనే వ్యక్తిపై హత్యాయత్నం కేసులో ఇద్దరిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని, అమె మతిస్థిమితం కోల్పోయేందుకు కారణం కావడంతో పాటు గ్రామంలో పరువు తీశాడని కోపంతో అమె మేనల్లుడు సోమన్నగౌడ్‌పై కక్ష పెంచుకొన్నాడని అన్నారు. దీంతో గ్రామానికి చెందిన మరొకరి సహకారం తీసుకొని ఆదివారం ఇంటి ముందు నిద్రిస్తున్న సమయంలో పిడిబాకుతో చంపేందుకు ప్రయత్నించారని తెలిపారు. మంగళవారం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వచ్ఛభారత్ మిషన్ అమలు పరిశీలన



అంగన్‌వాడీ వర్కర్‌తో మాట్లాడుతున్న హిమాల్‌రాజ్

కణేకల్లు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడేగోళం గ్రామంలో అమలవుతున్న స్వచ్ఛభారత్ మిషన్ అమలు కార్యక్రమాన్ని జాతీయ వాష్ ఎక్స్‌పర్ట్ హిమాల్‌రాజ్ సోలంకి మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని మురుగునీటి వ్యవస్థ, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు, ఇంటింటికి అమలవుతున్న మంచినీటి సరఫరా వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ శివకృష్ణరెడ్డి, ఈఓఆర్డీ చంద్రమౌళి, సర్పంచ్ లావణ్య, టీడీపీ నాయకులు మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

రాయదుర్గం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అభినందించారు. 20 మంది విద్యార్థులకు శాలువలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పరీక్షల్లో మంచిమార్కులు సాధించి గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు వీరేష్, ఆదిల్ బాషా, శ్రీనివాసులు, రూపావతి, అరుణ, అజహర్ పాల్గొన్నారు.





రాయదుర్గంలో విద్యార్థినికి సత్కారం, తాడిపత్రిలో అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

● తాడిపత్రి : ఇంటర్ ఫలితాల్లో 992 మార్కులు సాధించిన సాయిసిద్ధార్థ కళాశాల విద్యార్థిని మెహెక్ సుల్తానాను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. స్థానిక కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి మార్కులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థిని సుల్తానా మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రులు షామీర్‌బాషా, తల్లి కలీమున్నిసా ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు. భవిష్యత్తులో కంప్యూటర్ సైన్స్ చేస్తానని తెలిపారు. విద్యార్థిని తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

త్వరలో పల్లె పండుగ నిధుల మంజూరు

పంచాయతీరాజ్ డీఈ రాజన్న

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ పథకం కింద చేసిన పనులకు త్వరలోనే నిధులు మంజూరవుతాయని పంచాయతీరాజ్ శాఖ డీఈ రాజన్న తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు మండలాల్లో ఈ పథకం కింద సీసీ రోడ్లు వేశారని, సుమారు రూ. 11 కోట్ల నిధులు త్వరలోనే మంజూరు అవుతాయని అన్నారు. పలు విషయాలను ఆంధ్రజ్యోతితో వెల్లడించారు.

ప్రశ్న : ఎలాంటి అభివృద్ధి పనులు చేపడుతున్నారు..?

జవాబు : కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో 234 పనులు, రెండో విడతలో 24 పనలు చేపట్టాం. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, కల్వర్టులు వేసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నాం.

ప్రశ్న : ప్రతి పనికీ ఇంజనీర్లు డబ్బులు అడుగుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై మీ స్పందన ఏమిటి..?

జవాబు : పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పనిచేసే ఏ ఒక్క ఇంజనీరైనా డబ్బు అడిగితే నా దృష్టికి తీసుకురండి. అలాంటి వారిపై ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మీరేమంటారు..?

జవాబు : సీసీ రోడ్లను వేసేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే, ఆయా పరిధిలో పనిచేసే ఇంజనీర్లే బాధ్యత వహించాలి. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలో నిజమని తేలితే చర్యలు తప్పవు.

ప్రశ్న : సీసీ రోడ్లు వేసేటప్పుడు ఇంజనీర్లు ఉంటున్నారా..?

జవాబు : సంబంధిత మండల ఇంజనీర్ పర్యవేక్షణలోనే సీసీ రోడ్లు వేయాలి. లేనిపక్షంలో విచారించి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : విధులకు హాజరుకాని మండల ఇంజనీర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు : మండల ఇంజనీర్లు తప్పకుండా ప్రతిరోజు విధులకు హాజరు కావాలి. విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తెలిస్తే వారే ఇబ్బందుల్లో పడతారు.

ప్రశ్న : అండర్ గ్రౌండ్ డ్రైనేజీల పరిస్థితి ఎలా ఉంది..?

జవాబు : కంబదూరు మండల కేంద్రంలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీని క్రితం నిర్మించాం. పూర్తిస్థాయిలో పర్యవేక్షించి సమస్యను పరిష్కరిస్తాం.

కాలవకు తులాభారం



ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు చక్కెర తులాభారం

డి.హీరేహాళ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన కాలవ శ్రీనివాసులు గెలుపొందాలని మండలంలోని ఎం.హనుమాపురంలోని వన్నూరుస్వామితాతకు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు మొక్కుకున్నారు. మంగళవారం ఎం. హనుమాపురంలో వన్నూరుస్వామితాత ఉరుసును ఘనంగా నిర్వహించారు. మొక్కుతీర్చుకోవడంలో భాగంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వన్నూరుస్వామితాత ఉరుసులో పాల్గొన్నారు. అనంతరం మొక్కుబడిలో భాగంగా స్వామికి కాలవ శ్రీనివాసులు తరపున చక్కెర తులాభారం వేశారు. ఆయన బరువుకు తగ్గ చక్కెరను స్వామికి అందించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పనిచేసి.. పంపించండి: జేసీపీఆర్



కార్యాలయానికి వచ్చినవారితో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పనిమీద వచ్చిన వారిని ఎక్కువ సేపు ఇక్కడ ఉంచకుండా వెంటనే పనిచేసి పంపించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రజలు అర్జీలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని అధికారుల వద్దకు వచ్చారు. చైర్మన్ కార్యాలయానికి వెళుతుండగా అక్కడ కొంతమంది వృద్ధులు కనిపించారు. ఇంటిపన్ను, నీటిపన్ను తదితర వాటిపై వచ్చామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులను పిలిపించి వచ్చిన వారికి పనిచేసి పంపించాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు బాధితులకు పంపిణీ చేశారు. అనంతపురం రాంనగర్‌లో మంగళవారం వ్యాసాపురం గ్రామానికి చెందిన సందీప్ కుమార్‌కు రూ.3 లక్షలు, పాల్తూరు గ్రామానికి చెందిన దొడ్డయ్యకు రూ.1.86 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బీడీ మారయ్య, వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

యాడికి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేర్వేరు సంఘటనల్లో ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. యాడికిలో మద్యం మత్తులో గొడవపడి బీరుబాటిల్‌తో దాడిచేసి గాయపరిచిన సంఘటనలో బాధితుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు మహేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యాడికిలోని కుంటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాగభూషణ అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 12మద్యం బాటిళ్లను సీజ్‌చేసినట్లు తెలిపారు.

వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయండి

శెట్టూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడు యూనియన్ బ్యాంకులో వడ్డీ కట్టించుకుని పంట రుణాలు రెన్యువల్ చేయాలని మంగళవారం రైతులు, వివిధ పార్టీల నాయకులు బ్యాంకు మేనేజర్ జగదీష్‌ని కోరారు. ఈ మేరకు ఆయన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అధిక వడ్డీలకు బయట అప్పులు తెచ్చి రెన్యువల్ చేసుకోవాలంటే రైతుల వల్ల కావడం లేదని తెలిపారు.

● బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని వేపులపర్తి గ్రామంలో యూనియన్ బ్యాంకు మేనేజరు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాడని బ్రహ్మసముద్రం మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. అసలు, వడ్డీ మొత్తం కడితేనే రెన్యూవల్ చేస్తానని నోటీసు బోర్డు పెట్టారని తెలిపారు. రైతులకు తలకు మించిన భారంగా ఉందన్నారు. గతంలో మాదిరి వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలని రైతులతో కలిసి బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేశారు.





శెట్టూరు, బ్రహ్మసముద్రంలో బ్యాంకుల వద్ద రైతుల నిరసన